విశాఖపట్టణం
బుధవారం 6 మే 2026

For a pure tomorrow..

# జయ జయహే

jayajayahey.in సంపుటి: 9 సంచిక: 102 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

## పైసా వసూలు వ్యాజ్యాలుగా మారుతున్న పిల్స్

### శబరిమల కేసులో సుప్రీం వ్యాఖ్యలు

ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:



న్యాయస్థానాల్లో న్యాయం కోరుతూ దాఖలు చేసే ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు(పిల్) దుర్వినియోగం అవుతుండటం పట్ల సుప్రీం కోర్టు మంగళవారం ఆందోళన వ్యక్తం చేసింది. ప్రజాప్రయోజన వ్యాజ్యాలు కాస్తా వ్యక్తిగత ప్రయోజన వ్యాజ్యం, ప్రజా ప్రయోజన వ్యాజ్యం, డబ్బు ప్రయోజన వ్యాజ్యం, రాజకీయ ప్రయోజన వ్యాజ్యాలుగా మారిపోతున్నాయని వ్యాఖ్యానించింది. కేరళలోని శబరిమల ఆలయం సహా దేశంలోని వివిధ ఆలయాల్లో మహిళల పట్ల చూపుతున్న వివక్ష, అలాగే వివిధ మతాల పరిధిలో మత స్వేచ్ఛ విస్తృతిపై దాఖలైన పలు పిటిషన్లను విచారించిన తొమ్మిది మంది న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం.. 10 నుంచి 50 ఏండ్ల మహిళలకు శబరిమల ఆలయ ప్రవేశాన్ని నిషేధించడాన్ని ఇండియన్ యంగ్ లాయర్స్ అసోసియేషన్ సవాల్ చేయడంలో గల లక్ష్యమేమిటని ప్రశ్నించింది.




## ఓడినా తగ్గని.. దీదీ

### రాజీనామాకు ససేమీరా

### వెస్ట్ బెంగాల్‌లో కొత్త ఎత్తుగడలు

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

పశ్చిమ బెంగాల్ రాజకీయ చరిత్రలో 2026 ఎన్నికలు ఒక అనూహ్య మలుపుగా నిలిచిపోయాయి. దశాబ్ద కాలం పాటు అప్రహత ద్విజయ యాత్రను కొనసాగించిన తృణమూల్ కాంగ్రెస్ కోటలు బద్దలయ్యాయి. గతంలో 214 స్థానాలతో తిరుగులేని శక్తిగా ఉన్న టీఎంసీ, ఈసారి కేవలం 80 స్థానాలకు పరిమితమై ఘోర పరాజయాన్ని చవిచూసింది. మరోవైపు, భారతీయ జనతా పార్టీ ఏకంగా 207 స్థానాలను కైవసం చేసుకుని, బెంగాల్ గడ్డపై కాషాయ జెండాను రెపరెపలాడించింది. అయితే, ఈ ఎన్నికల ఫలితాల కంటే కూడా ఆ తర్వాతి పరిణామాలు భారత రాజ్యాంగ వ్యవస్థకు సవాలుగా మారాయి. ముఖ్యంగా భవానీపూర్ నియోజకవర్గంలో తన చిరకాల ప్రత్యర్థి సువేందు అధికారి చేతిలో 15,114 ఓట్ల తేడాతో ఓడిపోయిన ప్రస్తుత ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, ఫలితాల అనంతరం సంచలన వ్యాఖ్యలు చేశారు. "నేను ఓడిపోలేదు, నేను రాజీనామా చేయను, నేను రాజ్‌భవన్‌కు ..మిగతా 2లో

# జూన్ 1 నుంచి రైల్వే జోన్


### విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ గెజిట్ విడుదల

### చిరకాల స్వప్నం నెరవేరిందన్న సీఎం చంద్రబాబు

### ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపిన సీఎం చంద్రబాబు

### ఉత్తరాంధ్ర పారిశ్రామిక ప్రగతికి దోహదపడుతుందని ఆశాభావం




(అమరావతి - జయజయహే)

విశాఖ రైల్వేజోన్ ఏర్పాటు చేస్తూ గెజిట్ విడుదలపై సీఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. విజ్ఞప్తిని మన్నించి చారిత్రాత్మక గెజిట్ విడుదల చేసిన ప్రధాని నరేంద్ర మోదీ, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ధన్యవాదాలు తెలియచేస్తున్నానన్నారు. 2026, జూన్ 1వ తేదీ నుంచి విశాఖ కేంద్రంగా జోన్ అధికారిక కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయని తెలిపారు. వాల్తేరు డివిజన్ పునర్వ్యవస్థీకరణలో భాగంగా పలాస-ఇచ్ఛాపురం వంటి కీలక సెక్షన్లను విశాఖ డివిజన్‌లో విలీనం చేయడం ఉత్తరాంధ్ర రవాణా రంగ ముఖచిత్రాన్ని మారుస్తుందన్నారు.

నూతనంగా ఏర్పాటైన విశాఖ డివిజన్, రాయగడ డివిజన్ ల మధ్య సమన్వయంతో రైల్వే వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందన్నారు. సుమారు 463 కిలోమీటర్ల మేర ఉన్న ప్రాంతం విశాఖపట్నం డివిజన్‌గా మారి దక్షిణ కోస్తా రైల్వే జోన్‌లో ఉంటుంది. మిగిలిన 696 కిలోమీటర్ల ప్రాంతాన్ని ఒడిశాలోని రాయగడ కేంద్రంగా కొత్త డివిజన్‌గా ఏర్పాటు చేసి, దానిని ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలో ఉంచారు.

జోన్ ప్రధాన కార్యాలయ నిర్మాణం కోసం విశాఖలోని ముడసర్లోవ వద్ద సుమారు 52.2 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కేటాయించింది. జోన్ కార్యాలయ భవనాలు, ఇతర వసతుల కోసం సుమారు రూ.184 కోట్లు కేటాయించారు. ఈ జోన్ ఏర్పాటు వల్ల ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే మౌలిక సదుపాయాలు మెరుగుపడటమే కాకుండా, స్థానికులకు ఉద్యోగ అవకాశాలు, కొత్త రైళ్లు, రవాణా సౌకర్యాలు పెరుగుతాయని అధికారులు భావిస్తున్నారు.

# ఆ రాష్ట్రాల్లో సీఎం ఎవరో..?

### ఉత్కంఠగా మారిన కేరళ, వెస్ట్ బెంగాల్ సీఎం కుర్చీలు

(ప్రత్యేక ప్రతినిధి, జయజయహే)





పశ్చిమ బెంగాల్, అస్సాం రాష్ట్రాల రాజకీయ చరిత్రలో ఒక నూతన అధ్యాయం మొదలైంది. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ సాధించిన అపూర్వ విజయం, ఆయా రాష్ట్రాల్లో ప్రభుత్వ ఏర్పాటు దిశగా అడుగులు వేగవంతం చేసింది. ఢిల్లీ నుంచి రాష్ట్ర రాజధానుల వరకు రాజకీయ సందడి నెలకొంది. పశ్చిమ బెంగాల్‌లో తొలిసారిగా అధికార పీఠాన్ని దక్కించుకోబోతున్న బీజేపీ, అక్కడ ..మిగతా 2లో

## మోడీకి విజయ్ థాంక్స్..!

(ప్రత్యేక ప్రతినిధి, జయజయహే)

తమిళనాడు రాజకీయాల్లో ఒక నూతన శకం ఆరంభమైంది. దశాబ్దాల కాలంగా ద్రవిడ దిగ్గజాల నీడలో సాగిన రాష్ట్ర రాజకీయాలు, ఇప్పుడు ఒక సరికొత్త మలుపు తిరిగాయి. శాసనసభ ఎన్నికల ఫలితాలు యావత్ దేశాన్ని ఆశ్చర్యపరిచాయి. ప్రముఖ నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కజగం పార్టీ 108 స్థానాలను కైవసం చేసుకుని, అతిపెద్ద పార్టీగా అవతరించి చరిత్ర సృష్టించింది. సినిమా గ్లామర్‌ను ప్రజాబలంగా మార్చుకోవడంలో విజయ్ అద్భుత విజయాన్ని సాధించారు. అయితే, ఈ గెలుపు కంటే ఆయన ప్రదర్శిస్తున్న వినయం, పరిణతి ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. విజయం లభించిన వెంటనే ఆయన అహంకారానికి తావు లేకుండా, బాధ్యతాయుతమైన నాయకుడిగా వ్యవహరిస్తున్నారు. విజయ్ ఘన విజయంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేకంగా ..మిగతా 2లో




## ప్రముఖ నిర్మాత ఆర్బీ చౌదరి మృతి

### రోడ్డు ప్రమాదంలో దుర్మరణం

(ప్రత్యేక ప్రతినిధి, జయజయహే)

తెలుగు, తమిళంతో పాటు వివిధ భాషల్లో దాదాపు 100కి పైగా చిత్రాలను నిర్మించి మంచి గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ నిర్మాత ఆర్‌బీ చౌదరి కన్నుమూశారు. ఓ పని నిమిత్తం రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌కు చెందిన చౌదరి, అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఆసుపత్రిలో చేర్చినప్పటికీ తీవ్ర గాయాలు కావడంతో కోలుకోలేక ఆయన తుది శ్వాసవిడిచారు. ఈ దుర్వార్త విన్న కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. అలాగే పలువురు సినీ ప్రముఖులు ఆర్బీ చౌదరి మృతికి సంతాపం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఆయన పార్థివ దేహాన్ని మే 6న బుధవారం చెన్నైకి తరలించనున్నారు. అక్కడే అంతిమ సంస్కారాలు నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. కాగా రంగం, యాత్ర 2 సినిమాలతో తెలుగు ఆడియెన్స్ కు చేరువైన కోలీవుడ్ హీరో జీవా ..మిగతా 2లో







## ప్రజలు మనస్సులు గెలవాలి

### మళ్ళీ వాళ్ళే గెలిపిస్తారు... టీడీపీ నేతలతో కాఫీ కబుర్లలో లోకేశ్

(అమరావతి - జయజయహే)

ప్రజల మనసులు గెలవండి.. మళ్లీ, మళ్లీ మనల్ని గెలిపిస్తారని తెలుగు దేశం పార్టీ క్లస్టర్లు, ఇన్‌చార్జిలకు ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. మంగళవారం అమరావతిలో వారితో కాఫీ కబుర్లు పేరుతో సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమం జనంలోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కేడర్‌దేనని వెల్లడించారు. పనిచేయని వారి పదవులు ఊడతాయని పార్టీ అధినేత హెచ్చరించారని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వ కొనసాగింపు చాలా అవసరమని ఆయన కుండ బద్దలు కొట్టారు.

చేసిన అభివృద్ధి - సంక్షేమం ప్రజలకు వివరించాలని దిశా నిర్దేశం చేశారు. అహంకారం వీడి సత్ప్రవర్తన, మంచి మాటలతో ప్రజల మనస్సులు గెలవాలంటూ వారికి సూచించారు. తెలుగుదేశం పార్టీ లీడర్లు, కేడర్ సమన్వయం చేసుకుంటూ అనునిత్యం ప్రజలతో మమేకం కావడం ముఖ్యమని వారికి మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. గత ఎన్నికల్లో గొడ్డలి పార్టీ 151 నుంచి 11సీట్లకు దిగజారడానికి వారి అహంకారమే కారణమని వైసీపీని ఉద్దేశించి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు.

## 7న విజయ్ ప్రమాణ స్వీకారం

### వేదికగా నెహ్రూ ఇండోర్ స్టేడియం

### సన్నాహాలు చేస్తున్న తమిళనాడు ప్రభుత్వం

(ప్రత్యేక ప్రతినిధి- జయజయహే)



అసెంబ్లీ ఎన్నికల్లో ఏకైక పెద్ద పార్టీగా నిలిచిన తమిళగ వెట్రి కళగం పార్టీ ప్రభుత్వ ఏర్పాటుకు సన్నాహకాలు చేస్తోంది. పార్టీ అధినేత విజయ్ శాసనసభాపక్ష నేతగా ఎన్నిక కావడంతో ఈనెల 7న కొత్త ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో ప్రమాణస్వీకర కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నాయి. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే అనూహ్యంగా 108 స్థానాల్లో విజయం సాధించినప్పటికీ ప్రభుత్వం ఏర్పాటు అవసరమైన మ్యాజిక్ ఫిగర్ 118 సీట్లను దక్కించుకోలేకపోయింది. మెజారిటీకి మరో 10 మంది ..మిగతా 2లో

# ఆ రాష్ట్రాల్లో సీఎం ఎవరో..?





**మొదటి పేజీ తరువాయి...**

ప్రభుత్వాన్ని అత్యంత పటిష్టంగా నిర్మించాలని భావిస్తోంది. ఈ కీలక బాధ్యతను కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్వయంగా భుజానకెత్తుకున్నారు. బెంగాల్ రాజకీయ సరళిని, క్షేత్రస్థాయి పరిస్థితులను క్షుణ్ణంగా తెలిసిన వ్యక్తిగా, ముఖ్యమంత్రి అభ్యర్థి ఎంపిక, మంత్రివర్గ కూర్పును ఆయనే పర్యవేక్షిస్తున్నారు. ఈ వ్యూహాత్మక అడుగు ద్వారా పార్టీ కేడర్‌లో కొత్త ఉత్సాహం నెలకొంది. అటు అస్సాంలో వరుస విజయాల పరంపరను కొనసాగిస్తూ, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే ప్రక్రియను బీజేపీ పార్లమెంటరీ బోర్డు అధికారికం చేసింది. శాసనసభ పక్ష నాయకుడిని ఎన్నుకునేందుకు కేంద్రం ఇద్దరు కీలక నేతలను రంగంలోకి దింపింది. అస్సాం కేంద్ర పరిశీలకుడుగా కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జగత్ ప్రకాష్ ను నియమించయింది. సహ-పరిశీలకుడుగా హర్యానా ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైని నడ్డాకు సహకరిస్తూ, ఎమ్మెల్యేల అభిప్రాయాలను సేకరిస్తారు. ఈ ఇద్దరు నేతలు గౌహతిలో జరగనున్న శాసనసభ పక్ష సమావేశంలో పాల్గొని, ఏకాభిప్రాయంతో నాయకుడిని ఎంపిక చేసి, ప్రభుత్వ ఏర్పాటుకు మార్గం సుగమం చేస్తారు. ఎన్నికల విజయానంతరం అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ విజయం కేవలం పార్టీది మాత్రమే కాదని, ప్రధాని మోదీపై ప్రజలకున్న అచంచలమైన నమ్మకానికి నిదర్శనమని పేర్కొన్నారు. “అస్సాంలో అభివృద్ధి గంగానది నిరంతరం ప్రవహించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డబుల్ ఇంజిన్ వేగంతో పనిచేస్తాయి” అని ఆయన ఆకాంక్షించారు.మొత్తానికి, ఈ రెండు రాష్ట్రాల్లో భారతీయ జనతా పార్టీ సాధించిన విజయాలు ఈశాన్య, తూర్పు భారత రాజకీయ ముఖచిత్రాన్ని మార్చివేశాయి. పశ్చిమ బెంగాల్‌లో అమిత్ షా వ్యూహాలు, అస్సాంలో జేపీ నడ్డా పర్యవేక్షణ కలిసి సుస్థిరమైన, అభివృద్ధి పథంలో నడిచే ప్రభుత్వాలను అందిస్తాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రమాణ స్వీకార వేడుకలకు ముహూర్తం ఖరారు కావడంతో, ఇరు రాష్ట్రాల ప్రజలు నూతన పాలన కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.




## ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌కు
# సీఎం చంద్రబాబు ప్రశంసలు

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**

మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన తూర్పుగోదావరి జిల్లా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లాలోని ఎమ్మెల్యేలతో పాటు రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ హాజరయ్యారు. జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాల అమలు, పార్టీ బలోపేతం వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు.సమావేశంలో ప్రతి ఎమ్మెల్యే తమ తమ నియోజకవర్గాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు, ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై ముఖ్యమంత్రికి వివరించారు. ఈ క్రమంలో రాజమహేంద్రవరం నియోజకవర్గంలో జరుగుతున్న మౌలిక వసతుల అభివృద్ధి, పౌర సేవల మెరుగుదల, పార్టీ కార్యకలాపాల విస్తరణ వంటి అంశాలను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వివరించారు.ఆయన నివేదికను శ్రద్ధగా విన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాజమహేంద్రవరం ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సంతృప్తి వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే పనితీరును ప్రత్యేకంగా అభినందించారు. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడం, ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నుండి వచ్చిన ప్రశంసలు మరింత బాధ్యతను పెంచాయని తెలిపారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తూ, రాజమహేంద్రవరం నగరాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.సమావేశంలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల సమగ్ర అభివృద్ధి కోసం సమన్వయంతో పనిచేయాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# 17న దుర్గమ్మ జాతర

**విశాఖపట్నం (జయ జయహే)**



శ్రీ దుర్గమాంబ అమ్మవారి జాతర మహోత్సవం ఈ నెల 17 తేదీన నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త ఎరుపల్లి అప్పారావు తెలియజేశారు. 16 గ్రామాల ఇలవేల్పు, శాంతినగర్ లో వేంచేసి శ్రీ దుర్గమాంబ వార్షిక మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కైలాసపురం రోడ్డులోని అమ్మవారి 31 వ వార్షికోత్సవం మే 17 వ తేదీన జరుగుతుందన్నారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ఉదయం నుండి పసుపు కుంకుమలతో విశేష పూజలు ఉంటాయని తెలిపారు. సాయంత్రం ఘట్టాలు, నృత్యాలతో నిర్వహించే భారీ ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది అని అన్నారు . ఎప్పటిలాగే ఈ ఏడాది సాంస్కృతి కార్యక్రమాలు భారీ స్థాయిలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు రేలా రేలా జానపద గీతాలు, విలీనం ఆర్కెస్ట్రా, స్టేజ్ ప్రోగ్రాములు ఉంటాయన్నారు, అమ్మవారి ఆలయ ప్రాంగణం సహా కైలాసపురం రోడ్డు లో భారీ విద్యుత్ దీపాలంకరణ ఈ ఉత్సవాలకు ఒక హైలెట్ గా నిలుస్తాయని ఆయన పేర్కొన్నారు అమ్మవారి జాతర మహోత్సవంలో విరివిగా భక్తులకు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు తీసుకోవాలని అప్పారావు విజ్ఞప్తి చేశారు.



# గిరిజనుల భూ సమస్య పరిష్కారం..

**నర్సీపట్నం - జయ జయహే :**

కొన్ని ఏళ్లగా గిరిజనులకు, గిరిజనేతలకు భూ సమస్య తలెత్తడంతో గ్రామ పెద్దల పరిష్కారంతో సమస్యకు కొలిక్కి వచ్చిందని గిరిజనులు పేర్కొన్నారు. నాతవరం పంచాయతీ శివారు చినజగ్గంపేట గ్రామ రెవెన్యూ పరిధిలో 20 ఎకరాల భూమి గిరిజనులు, గిరిజనేతరుల మధ్య కొంతకాలంగా వివాదం ఉందన్నారు. ఏళ్లనాటి భూ సమస్యను గ్రామ పెద్దల సమక్షంలో రికార్డులు ఆధారంగా పరిష్కరిం చుకుంటే, బయట వ్యక్తులు స్వలాభం కోసం వివాదాలు సృష్టించేందుకు కుట్ర చేస్తున్నారని గ్రామస్తులు వాపోయారు. ఈ సందర్భంగా చినజగ్గంపేటకు చెందిన గిరిజన పెద్దలు మువ్వా భీమరాజు, రొంపల శ్రీను, వెలగాడ రాజుబాబు, వాకపల్లి రాజుబాబు, తురంబోయిన రాజబాబు, ఎన్. రమణబాబు, వి.కొండబాబు మాట్లాడుతూ ఈ భూమికి సంబంధించి గిరిజనుల వద్ద ఎలాంటి రికార్డులు లేకపోవడంతో ఇటీ వల న్యాయస్థానం గిరిజనేతురుడైన నాతవరానికి చెందిన అంకంరెడ్డి నూకరాజుకు అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. తీర్పు తర్వాత గ్రామపెద్దల సమక్షంలో సామరస్యంగా సమస్య పరిష్కరించుకున్నామన్నారు. గిరిజనులకు నాలుగు ఎకరాలు ఇవ్వడానికి భూ యాజమాని అంగీకారం తెలిపారన్నారు. ఇంతలో కొంత మంది బయట వ్యక్తులు గిరిజనులను అడ్డుపెట్టుకోని వివాదాలు సృష్టించేందుకు కుట్ర చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. నర్సీపట్నం ఆర్డీఓకి పిజిఆర్ఎస్ లో సమస్య పరిష్కారం గ్రామ పెద్దలు మేము కూర్చొని పరిష్కరించుకున్నామని , ప్రజలకు నాలుగు ఎకరాలు ఇవ్వటానికి పెద్దలు అంగీకరించడంతో మా సమస్య పరిష్కారం అయిందన్నారు. ఈ సమస్య పరిష్కారం అవడంతో ఆర్డీవో కార్యాలయంలో లిఖితపూర్వకంగా ఫిర్యాదును సమర్పించారు. నర్సీపట్నం ఏవో స్పందించి తక్షణమే నాతవరం తాసిల్దార్ కి తెలియపరుస్తామని తెలిపారు.




# విశ్వ కళ్యాణ కారకం రామాయణ పఠనం

**వెల్దుర్థి (జయ జయహే)**

ఆదికవి వాల్మీకి ప్రపంచానికి అందించిన పరమ కళ్యాణ కారకమైన గ్రంథం శ్రీమద్రామాయణమని, రామాయణంలోని ప్రతి అంశము ఈనాటికీ మానవులందరికీ మార్గదర్శనీయాలుగా ఉన్నాయని, శ్రీరామచంద్రుని సుగుణాలు, ధర్మ నిర్వహణ ఆచంద్ర తారార్కము అనుసరణీయాలని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్, ఉమ్మడి కర్నూలు జిల్లాశాఖ కార్యక్రమనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకట రెడ్డి అన్నారు. హిందూ ధర్మ ప్రచార పరిషత్ ధార్మిక కార్యక్రమాలు వెల్దుర్తి మండలం మల్లేపల్లి గ్రామంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో మంగళవారం ధార్మిక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. మొదటిరోజు శ్రీమద్రామాయణ ప్రాముఖ్యంపై ధార్మిక ఉపన్యాసకులు సాహితీవేత్త కవి రాజహంస డాక్టర్ తొగట సురేశ్ బాబు ప్రవచించారు. ఉపన్యాసకులు మాట్లాడుతూ రామాయణము అన్నదమ్ముల అనుబంధానికి, భార్యాభర్తల అనురాగానికి, పాలకుల ధర్మ నిర్వహణకు, మానవుని పురుషార్థ సాధనకు అవసరమైన అన్ని అంశాలను తెలియజేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు తిరునగరి రంగస్వామి, గ్రామ పెద్దలు కారం రామిరెడ్డి, భజన మండలి అధ్యక్షులు కె. రుక్మాంగధ రెడ్డి, హార్మోనిష్టు గొల్ల చిన్నయ్య, భజన మండలి సభ్యులు తబలిస్ట్ టి. రామాంజనేయులు, వి. శేఖర్, భాష్యం శీలయ్య, చిన్న మాధన్న, సూర మాదన్న, ఎల్లయ్య, వి. రామకృష్ణ, సుంకన్న, చిన్న గోవింద రెడ్డి, బి. మద్దిలేటి, యం. చిన్న రాముడు, పి. సిద్దయ్యతోపాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



# ఓడినా తగ్గని.. దీదీ

**మొదటి పేజీ తరువాయి...**

వెళ్లను” అంటూ ఆమె భీష్మించుకోవడంతో రాష్ట్రంలో రాజ్యాంగ సంక్షోభం తలెత్తింది.

**భారత రాజ్యాంగం ఏం చెబుతోంది?**

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 164 ప్రకారం, ముఖ్యమంత్రి గవర్నర్ అభీష్టం ఉన్నంత వరకే పదవిలో కొనసాగుతారు. ఎన్నికల్లో ప్రజల తీర్పు స్పష్టంగా ఉన్నప్పుడు, మెజారిటీ కోల్పోయిన నాయకుడు పదవిలో కొనసాగే నైతిక హక్కును కోల్పోతారు. ఒకవేళ ఓడిపోయిన ముఖ్యమంత్రి మొండిగా రాజీనామాకు నిరాకరిస్తే, గవర్నర్‌కు కీలక అధికారాలు ఉంటాయి.బలవంతపు తొలగింపు: మెజారిటీ లేని మంత్రివర్గాన్ని రద్దు చేస్తూ గవర్నర్ తక్షణమే అధికారిక ఉత్తర్వులు జారీ చేయవచ్చు.అసెంబ్లీ సమావేశం: అసాధారణ పరిస్థితుల్లో గవర్నర్ వెంటనే శాసనసభను సమావేశపరిచి, ‘ఫ్లోర్ టెస్ట్’ నిర్వహించవచ్చు. ప్రస్తుతం బీజేపీకి 207 సీట్ల బలం ఉండటంతో, అవిశ్వాస తీర్మానం ద్వారా టీఎంసీ ప్రభుత్వాన్ని నిమిషాల్లో కూల్చివేసే అవకాశం ఉంటుంది.రాష్ట్రపతి పాలన (ఆర్టికల్ 356): ఒకవేళ ముఖ్యమంత్రి కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు ఆటంకం కలిగిస్తూ, రాజ్యాంగ యంత్రాంగాన్ని స్తంభింపజేస్తే, గవర్నర్ కేంద్రానికి నివేదిక పంపి రాష్ట్రపతి పాలన విధించేలా చేయవచ్చు. ఇది ఒక రకంగా అణు ప్రత్యామ్నాయం వంటిది.పాలనా పరమైన చర్యలు: ముఖ్యమంత్రి మొండితనం ప్రదర్శిస్తే, గవర్నర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని, పోలీసు యంత్రాంగాన్ని తన నియంత్రణలోకి తీసుకుంటారు. ఓడిపోయిన ముఖ్యమంత్రి ఇచ్చే ఆదేశాలను పాటించవద్దని అధికారులకు సూచించవచ్చు. సచివాలయాన్ని సీజ్ చేసే అధికారం కూడా గవర్నర్‌కు ఉంటుంది.ప్రజాస్వామ్యంలో ప్రజా తీర్పు శిరోధార్యం. బెంగాల్‌లో మారిన రాజకీయ పటం ప్రకారం, బీజేపీకి లభించిన స్పష్టమైన మెజారిటీ ప్రజల ఆకాంక్షను ప్రతిబింబిస్తోంది. రాజ్యాంగ నిబంధనల ప్రకారం, అధికారం అనేది ఒక వ్యక్తి మొండితనం మీద కాకుండా, ప్రజాస్వామ్య విలువల మీద ఆధారపడి ఉంటుంది. కాబట్టి, మమతా బెనర్జీ రాజీనామా చేయకపోయినా, రాజ్యాంగం కల్పించిన రక్షణ కవచాల ద్వారా కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావడం అనివార్యం.

# 7న విజయ్ ప్రమాణ స్వీకారం

**మొదటి పేజీ తరువాయి...**

ఎమ్మెల్యేల మద్దతు అవసరం ఉంది. టీవీకే సారథ్యంలోని ప్రభుత్వానికి మద్దతిచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ సుముఖంగా ఉందని వినిపిస్తోంది. వామపక్ష పార్టీలు సైతం టీవీకే నేతలతో సంప్రదింపులు సాగించనున్నట్టు చెబుతున్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్-5, వీసీకే-2, సీపీఐ-2, సీపీఎం-2 సీట్లు గెలుచుకున్నాయి. ఐయూఎంఎల్, డీఎండీకే, పీఎంకే పార్టీలను నుంచి కూడా టీవీకేకు మద్దతు లభించే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది.తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో చారిత్రాత్మక విజయం సాధించిన తమిళగ వెట్రి కళగం అధినేత సి. జోసెఫ్ విజయ్, ప్రభుత్వ ఏర్పాటు దిశగా కీలక అడుగులు వేశారు. ఇప్పటికే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు తన క్లెయిమ్‌ను సమర్పించిన విజయ్, తన కేబినెట్ కూర్పుపై కసరత్తు పూర్తి చేసినట్లు తెలుస్తోంది. సీనియర్ నాయకులు, నమ్మకమైన అనుచరులు, యువత కలయికతో ఒక సమతుల్యమైన టీమ్ విజయ్ సిద్ధమైంది. విజయ్ కుడిభుజంగా, పార్టీ ప్రధాన కార్యదర్శిగా కీలక పాత్ర పోషించిన బుస్సీ ఆనంద్ కు కేబినెట్‌లో అత్యంత ప్రాముఖ్యత కలిగిన హోం శాఖ లేదా ప్రజా పనుల శాఖ దక్కే అవకాశం ఉంది. అలాగే, ఏఐఏడీఎంకే నుంచి వచ్చి టీవీకేలో చేరిన రాజకీయ ఉద్దండుడు సెంగోట్టయన్ అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని, ఆయనకు విద్యాశాఖ లేదా వ్యవసాయ శాఖ బాధ్యతలు అప్పగించవచ్చని సమాచారం. ఎన్నికల వ్యూహకర్తగా పేరుగాంచిన ఆదవ్ అర్జున కు పరిశ్రమలు లేదా ఆర్థిక శాఖ వంటి కీలక పోర్ట్‌ఫోలియోలు దక్కనున్నాయి.

# మోడీకి విజయ్ థ్యాంక్స్..!

**మొదటి పేజీ తరువాయి...**

అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా విజయ్ స్పందిస్తూ, తన రాజకీయ పంథా కేవలం ప్రతిపక్షం కోసం కాదని, అది అభివృద్ధి, వారసత్వం కోసం ఉంటుందని స్పష్టం చేశారు. ప్రధాని మోదీ అభినందనలకు విజయ్ స్పందిస్తూ, రాష్ట్ర పురోగతి కోసం కేంద్ర ప్రభుత్వ మద్దతు కావాలన్నారు. “మా ప్రజల సంక్షేమమే ఏకైక లక్ష్యం. రాజకీయ వైరుధ్యాలను పక్కన పెట్టి, రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేస్తాం,” అని విజయ్ తన వినయశీలతను చాటుకున్నారు. విజయ్ విజయంతో తమిళనాడులో మార్పు మొదలైందని విశ్లేషకులు భావిస్తున్నారు. భావోద్వేగపూరిత రాజకీయాల కంటే, అభివృద్ధి, సంక్షేమం చుట్టూ తన రాజకీయాలను మలచుకుంటానని విజయ్ ప్రకటించడం గమనార్హం. ఒక నటుడిగా కోట్లాది మంది అభిమానాన్ని పొందిన ఆయన, ఇప్పుడు ఒక ముఖ్యమంత్రిగా ప్రజాక్షేత్రంలో ఏ విధంగా రాణిస్తారో చూడాలని ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ గెలుపు కేవలం ఒక పార్టీ విజయం మాత్రమే కాదు, తమిళనాడు రాజకీయాల్లో ఒక కొత్త ఆశకు నాంది.

## ప్రముఖ నిర్మాత
# ఆర్బీ చౌదరి మృతి

**మొదటి పేజీ తరువాయి...**

ఆర్బీచౌదరి కుమారుడే. ఆర్బీ చౌదరి 1988లో ‘సూపర్ గుడ్ ఫిల్మ్స్’ అనే నిర్మాణ సంస్థను ప్రారంభించారు. అదే సంవత్సరంలో ‘అధిపాపం’ అనే మొదటి మలయాళ చిత్రాన్ని కూడా నిర్మించారు. ఆ తర్వాత 1990 నుండి తన ‘సూపర్ గుడ్’ నిర్మాణ సంస్థ కింద తెలుగుతో పాటు తమిళ భాషల్లోనూ సినిమాలు నిర్మించడం ప్రారంభించారు. తెలుగులో ఆర్బీ చౌదరి నిర్మించిన రాజా, సూర్యవంశం, సుస్వాగతం చిత్రాలు సూపర్ హిట్ గా నిలిచాయి. ఓవరాల్ గా తెలుగు, తమిళం, మలయాళ భాషల్లో వందకు పైగా చిత్రాలను నిర్మించారీ స్టార్ ప్రొడ్యూసర్. చివరిగా ఆయన ‘మరీసన్’ అనే తమిళ చిత్రాన్ని నిర్మించారు. ఇక ఆర్బీ చౌదరి ఇద్దరు కుమారులు, జితన్ రమేష్ జీవాలు కూడా హీరోలుగా పరిచయం కావడం గమనార్హం. కాగా ఆర్బీ చౌదరి రెగ్యులర్ గా ఉదయ్ పూర్ కు వెళుతుంటారు. అలా మంగళవారం (మే 05) కూడా వెళ్లగా దురదృష్టవశాత్తూ రోడ్డు ప్రమాదం బారిన పడ్డారు. వెంటనే ఆయన్ను ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మరణించారు.

## ఏపీయూడబ్ల్యూజే అల్లూరి జిల్లా
# నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవం

**కొయ్యూరు, జయ జయహే:**

ఏపీయూడబ్ల్యూజే అల్లూరి సీతారామరాజు జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక మంగళవారం కొయ్యూరులో ఏకగ్రీవంగా జరిగింది. చింతపల్లి ప్రెస్ క్లబ్ కొయ్యూరు మండల ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన జిల్లా మొదటి మహాసభలో ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా నూతన కార్యవర్గ ( జిల్లా మొదటి కార్యవర్గ) ఎన్నిక ఏకగ్రీవంగా నిర్వహించారు. ఐజయు సెక్రెటరీ జనరల్ డి సోమ సుందరం, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐ వి సుబ్బారావు, రాష్ట్ర కార్యదర్శి సిహెచ్విఎల్ స్వామి, ఎలక్ట్రానిక్ మీడియా స్టేట్ సెక్రటరీ జనరల్ రామచంద్రరావు, ఉపాధ్యక్షులు కిషోర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగరాజు తదితరుల సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కే ప్రభుదాస్ ( ప్రజాశక్తి, పాడేరు), జనరల్ సెక్రెటరీ ఏజే దయానంద్ ( ఆంధ్రజ్యోతి, చింతపల్లి), డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎస్ వెంకటరమణమూర్తి (ఆంధ్రజ్యోతి కొయ్యూరు ), కోశాధికారి జె సత్యనారాయణ (వార్త, కొయ్యూరు), ఉపాధ్యక్షులుగా ఎల్ బి వెంకటేశ్వరరావు (సూర్య అరకులోయ ), సిహెచ్ రాజు (సాక్షి చింతపల్లి ), సిహెచ్ వెంకటరమణ (సాక్షి జి.మాడుగుల ), సంయుక్త కార్యదర్శులుగా కే వెంకటేష్ (లీడర్ అనంతగిరి), పి సురేష్ (యువగళం చింతపల్లి ), కే దుర్గారావు (సాక్షి పాడేరు ), ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎస్వీ రమణ (ప్రజా ప్రతిభ జీకే వీధి ) లతోపాటు ఎం మోహన్ రావు (లీడర్ పాడేరు), వి ఉదయ్ కుమార్ (ఈనాడు ముంచింగిపుట్టు ), బి అరుణ్ కుమార్ (అఖండభూమి జి.మాడుగుల ), ఎం దొరబాబు (సాక్షి కొయ్యూరు ), వి.గణేశ్వరరావు (వార్త హుక్కుంపేట ), కే కొండబాబు (సాక్షి హుకుంపేట), కే గంగాధర్ (ఈనాడు హుకుంపేట ), కే కొండబాబు (ఆంధ్రప్రభ పెదబయలు) ఎం అశోక్ (ఆంధ్రజ్యోతి పెదబయలు ), ఎం చందు( సూర్య అనంతగిరి), కే వెంకటేష్ (లీడర్ అనంతగిరి), ఆర్ శ్రీను( ప్రజాగర్జన చింతపల్లి ) ఎం నాగేశ్వరరావు ( శుభోదయం దారకొండ ), ఎం రమణ (ఆంధ్రజ్యోతి సీలేరు ), ఎం చంటిబాబు(పెన్ పవర్, జికె వీధి), జి నరేంద్ర (విజన్ అనంతగిరి ) 15 మంది కార్యవర్గ సభ్యులతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.




**ఎలక్ట్రానిక్ మీడియా నూతన జిల్లా కార్యవర్గం**


ఎలక్ట్రానిక్ మీడియా అల్లూరి జిల్లా నూతన జిల్లా అధ్యక్షుడిగా ప్రణీత్ కుమార్ (ఏబీఎన్ అరకులోయ ), జనరల్ సెక్రటరీగా వి జోషి (పిటిఐ పాడేరు ), డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎస్ వనరాజు ( టీవీ9 చింతపల్లి), కోశాధికారి రమేష్ బాబు (ఎన్ టీవీ అరకులోయ ), ఉపాధ్యక్షులుగా ఎన్ సత్తిబాబు (టీవీ 5 చింతపల్లి), దేవిడ్ (ఆర్ టివి అరకులోయ ), సంయుక్త కార్యదర్శులుగా కె అప్పలరాజు (సివిఆర్ న్యూస్ చింతపల్లి ), డి ప్రశాంత్ (10 టీవి అరకులోయ ) కార్యవర్గ సభ్యులుగా జి రమేష్ చౌదరి (బి ఆర్ కే న్యూస్ చింతపల్లి ), బి శ్రీనివాసరావు (ఉత్తరప్రభ న్యూస్ పాడేరు ), ఎల్ పైడిరాజు (సాక్షి అరకులోయ ), జగదీష్ (టీవీ9 అరకులోయ ), పి హరిబాబు (టీవీ 5 అరకులోయ) లను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గానికి ఐజెయు సెక్రటరీ జనరల్ సోమ సుందరం, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐ వి సుబ్బారావు, రాష్ట్ర కార్యదర్శి సిహెచ్విఎల్ స్వామి, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర సెక్రటరీ జనరల్ రామచంద్రరావు, ఉపాధ్యక్షులు కిషోర్ ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగరాజు చింతపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సతీష్, పద్మరాజు(నాని ) తో పాటు కొయ్యూరు పాత్రికేయ బృందం ప్రత్యేక అభినందనలు శుభాకాంక్షలు తెలిపారు.



## మంచినీటి సరఫరా వ్యాన్లు పెంచాలని
# కమిషనర్‌కు మజ్జి విజ్ఞప్తి

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**

నగరంలో మంచినీటి సరఫరా సమస్యలను దృష్టిలో ఉంచుకుని వెంటనే చర్యలు తీసుకోవాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. ఈ మేరకు వైయస్సార్ పార్టీ మున్సిపల్ విభాగం అధ్యక్షుడు మజ్జి అప్పారావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కమిషనర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మజ్జి అప్పారావు మాట్లాడుతూ నగరంలోని 50 వార్డుల్లో ఎప్పుడైనా విద్యుత్ అంతరాయం, గోదావరి వరదలు లేదా పైపుల పగుళ్లు వంటి కారణాల వల్ల మంచినీటి సరఫరా తీవ్రంగా ప్రభావితమవుతోందని తెలిపారు. అలాంటి పరిస్థితుల్లో కార్పొరేషన్ తరఫున వ్యాన్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నప్పటికీ ప్రస్తుతం అందుబాటులో ఉన్న వ్యాన్ల సంఖ్య సరిపోవడం లేదని వివరించారు. ప్రస్తుతం రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కేవలం ఐదు మంచినీటి సరఫరా వ్యాన్లు మాత్రమే ఉన్నాయని, ఇవి మొత్తం 50 వార్డులకు సరిపోక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల్లో నీటి కొరత తీవ్రంగా ఉండడంతో ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు తక్షణమే మరిన్ని వ్యాన్లను అద్దెకు తీసుకోవడం లేదా కార్పొరేషన్ నిధులతో కొత్త వాహనాలను కొనుగోలు చేయాలని కమిషనర్‌ను విజ్ఞప్తి చేశారు. ప్రజలకు నిరంతరంగా మంచినీటి సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి స్పందించిన కమిషనర్ సమస్య తీవ్రతను గుర్తించి త్వరలోనే తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కాటం రజనీకాంత్, నల్ల రామాంజనేయులు, నందం స్వామి, రొక్కం త్రినాధ్, సేకిన మునీశ్వరరావు, రేగుళ్ల నాని, కట్ట వెంకటేష్, సత్యనారాయణ, ముచ్చకర్ల చిన్నారావు, మజ్జి కోటి, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా సమస్యల సత్వర
# పరిష్కారానికి చర్యలు
### తహసీల్దార్ మురళీబాబు..

**కొయ్యురు : (జయ జయహే)న్యూస్ మే 06**

అల్లూరి జిల్లా కొయ్యూరు మండల పరిధిలోని పలు ప్రజా సమస్యలపై వచ్చిన ఫిర్యాదులపై సత్వర పరిష్కారం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మండల రెవెన్యూ తహసీల్దార్ మురళీబాబు తెలిపారు. కొయ్యూరు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ సమావేశానికి పలు శాఖల అధికారులు హాజరయ్యారు. ప్రజల నుంచి వస్తున్న దరఖాస్తులను, ఫిర్యాదులను స్వీకరించినట్లు తహసీల్దార్ తెలిపారు. గ్రీవెన్స్‌లో వచ్చిన వాటిపై సంబంధిత అధికారులకు తెలియజేసి వాటిని సత్వర పరిష్కారం చేయాలని ఆదేశించారు.

ఈ మేరకు వచ్చిన ఫిర్యాదులు

రెవెన్యూ శాఖకు చెందినవి 7,

ల్యాండ్ సర్వే ఫారెస్ట్ శాఖ 1,

ఆర్‌డబ్ల్యూఎస్ 1,విద్యాశాఖకు సంబంధించిన వాటిలో తల్లికి వందనం ఒక ఫిర్యాదు వచ్చినట్లు తహసీల్దార్ మురళీబాబు తెలిపారు. ఈ మండల స్థాయి గ్రీవెన్స్ సమావేశానికి డిప్యూటీ ఎంపీడీఓ శ్రీనివాసరావు, జీఎస్ మేనేజర్, ఏఈ శివ రామ్ ప్రసాద్, పీఆర్ ఏఈలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జాతర మహోత్సవ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ





**విశాఖపట్నం (జయ జయహే)**

విశాఖ దక్షిణ నియోజకవర్గం 29వ వార్డు అంగడిదిబ్బ వద్ద శ్రీ శ్రీ పోలమ్మ, నూకాలమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్ల 26వ జాతర మహోత్సవ వేడుకలో దక్షణ నియోజకవర్గ శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవార్లను దర్శించుకుని ప్రజల శ్రేయస్సు, ప్రాంత అభివృద్ధి కోసం ప్రార్ధనలు చేశారు. జాతర ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులతో కలిసి ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సాంస్కృతిక కార్యక్రమాన్ని తిలకించారు. అనంతరం మాట్లాడుతూ, ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ప్రాంతీయ సంప్రదాయాలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వి ఎమ్ ఆర్ డి ఏ చైర్మెన్ ప్రణవ్ గోపాల్ , మాజీ డిప్యూటీ మేయర్ గోవింద్ రెడ్డి , మాజీ కార్పొరేటర్ సాదిక్ మాజీ కార్పొరేటర్ అనురాధ , స్థానిక వార్డు కూటమి అధ్యక్షులు శ్రావణ్ , శేఖర్ , స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



# కొలువు తీరిన కొండమ్మ
### ఘనంగా శతకం పట్టు ఏర్పాటు

**మాడుగుల మే 5 జయ జయహే**

మాడుగుల మాలకొండ అమ్మవారి జాతర నేపథ్యంలో మంగళవారం అమ్మవారి కొలువు తీరారు. జూన్ 2వ తేదీన అమ్మవారి జాతర నిర్వహించనున్న నేపథ్యంలో మంగళవారం ఉదయం ఏడు గంటలకు అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారు ఘటాలను ప్రతిమను పాదాలను ఊరేగింపుగా తీసుకొచ్చి ఏడున్నర గంటలకు శతకం పట్టు వద్ద కొలువుంచారు. నెలరోజులపాటు భక్తులు అమ్మవారిని శతకం పట్టుబడ్డ దర్శించుకుంటారు. ఈ సందర్భంగా ఆలయం నుంచి పదిహేను ఊరేగింపు నిర్వహించారు అమ్మవారికి పసుపు నీళ్లు, పసుపు కుంకుమలు సమర్పించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు అప్పలరాజు మాట్లాడుతూ అమ్మవారి జాతర నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ప్రజలందరూ తగు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు ఎస్ శ్రీనివాసరావు, బేమరిశెట్టి పైడయ్య నాయుడు, ఉత్సవ కమిటీ సభ్యులు, పలువురు గ్రామ పెద్దలు ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు



## పాసు పుస్తకాలతో రైతులకు
# ఎంతో ప్రయోజనం

**మాడుగుల మే 5 జయ జయహే**

భూమి పాసు పుస్తకాలతో రైతులకు ఎంతో ప్రయోజనం చేకూర్చొద్దని అందుకే ప్రభుత్వం వారికి ఈ పాస్వర్డ్ అందిస్తుందని స్థానిక ఎమ్మెల్యే బందరు సత్యనారాయణమూర్తి చెప్పారు. మంగళవారం మాడుగుల మండలం వొమ్మలి గ్రామంలో ఆయన రైతులకు రి సర్వే పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేశారు. మొత్తం 1420 మంది రైతులకు ఈ పాస్ పుస్తకాలు అందించిన ఎమ్మెల్యే రైతులు ఎంతో నష్టపోయారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పి అప్పలరాజు, తహసిల్దార్ కే రమాదేవి, ఉప తహసిల్దార్ ఎం రాజా, పెద్దేరు జలసి కమిటీ చైర్మన్ అద్దేపల్లి జగ్గారావు, సహకార సంఘం అధ్యక్షుడు ఉండూరు దేవుడు, మండల పార్టీ అధ్యక్షులు ఎన్నో సన్యాసిరావు, కార్యదర్శి పుప్పాల రమేష్ కూటమి నాయకులు పాల్గొన్నారు.

# రెండున్నర కోట్లతో సాగునీటి అభివృద్ధి పనులు
### ఎమ్మెల్యే బండారు

**మాడుగుల ఏప్రిల్ 5 జయ జయహే**



మాడుగుల నియోజకవర్గంలో 2026--27 సంవత్సరానికి జలవనరుల శాఖ ద్వారా 29 సాగునీటి అభివృద్ధి పనులు చేపట్టేందుకు సుమారు రూ. 2.50 కోట్లు రూపాయలు మంజూరైనట్టు స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తెలిపారు. వాటిలో భాగంగా మాడుగుల మండలంలోరూ. 38 లక్షల రూపాయలతో గాడిరాయి: వూరా చెరువు, కాలువల అభివృద్ధి, మాడుగుల పాలగెడ్డ కాలువ వ్యవస్థ అభివృద్ధి, వొమ్మాలి గోర్జుపారు బ్రాంచ్ చానల్ అభివృద్ధి, వొమ్మాలి బ్రాంచ్ చానల్ అభివృద్ధి, జలంపల్లి కొత్త కాలువ అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. అలాగే చీడికాడ మండలంలో రూ. 50 లక్షల రూపాయలతో అడ్డలోవగెడ్డ రిజర్వాయర్ అభివృద్ధి, తూరువోలు జురెడ్డివాని ట్యాంక్ అభివృద్ధి, జి.కొత్తపల్లి ధనిగెడ్డ, వొల్ల గెడ్డ అభివృద్ధి, చీడికాడ కోనం ప్రాజెక్ట్ హై లెవల్ చానల్, జి.కొత్తపల్లి లక్ష్మీపురం చానల్, ఎస్.ఎన్.పురం మార్లగుమ్మి అనికట్ సిస్టమ్, అప్పలరాజుపురం సిరిజం చానల్ అభివృద్ధి పనులు చేపడతామన్నారు. ఇక దేవరాపల్లి మండలంలో రూ. 83.40 లక్షలతో దేవరాపల్లి ఆర్.ఆర్.పి ఎర్త్ డ్యామ్ అభివృద్ధి, ముషిడిపల్లి మథలవాని ట్యాంక్ సర్ప్లస్ వీర్, కె.ఎం.పాలెం వెంకయ్య ట్యాంక్ సర్ప్లస్ వీర్, ముషిడిపల్లి నాగరాయుడు ట్యాంక్ చానల్ అభివృద్ధి, ఎ.కొత్తపల్లి రెడ్డివాని ట్యాంక్ స్లూయిస్, తేనుగుపూడి యెర్రి గెడ్డ చెక్ డ్యామ్, తిమిరం రైవాడ ఆర్ఎంసి కాలువ అభివృద్ధి, తిమిరం రైవాడ ఆర్ఎంసి ప్రొటెక్షన్ వాల్ అభివృద్ధి పనులు చేపడతామన్నారు. కే.కొత్తపాడు మండలంలో రూ. 78.60 లక్షలతో మల్లంపాలెం గరుగు బిల్లి కాలువ అభివృద్ధి, గొందుపాలెం పిక్ అప్ వీర్ అభివృద్ధి, కే.కొత్తపాడు పైడమ్మ ట్యాంక్ స్లూయిస్, కింతాడ రావిబంద ట్యాంక్ స్లూయిస్, సింగన్నదొరపాలెం ఎర్లె బండ సిస్టమ్ అభివృద్ధి, వి.సంతపాలెం నాగరాయుడు ట్యాంక్ స్లూయిస్ చానల్, సురెడ్డిపాలెం మోండిగెడ్డ చెక్ డ్యామ్, గొందుపాలెం సీతమ్మ ట్యాంక్ స్లూయిస్ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. మొత్తం నియోజకవర్గంలో 29 పనులు చేపడుతున్నట్టు పేర్కొన్నారు. ఈ పనుల ద్వారా చెరువులు, కాలువలు, చెక్‌డ్యామ్‌ల అభివృద్ధి ద్వారా నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందనీ, రైతులకు సమయానికి సాగునీటి సరఫరా మెరుగుపడుతుందన్నారు. అలాగే వ్యవసాయ ఉత్పాదకత పేరిగి గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందనీ పేర్కొన్నారు.

For a pure tomorrow.. జయహో



# ఒత్తిడి లేని విద్యావిధానం ఆవశ్యకత

(సి.హెచ్.ప్రతాప్)

విద్యార్థుల మానసిక ఆరోగ్యం, ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రస్తుత విద్యా వ్యవస్థలో, పరీక్షల విధానంలో సమూల మార్పులు తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. నేటి పోటీ ప్రపంచంలో చదువు అనేది జ్ఞానాన్ని సముపార్జించే మార్గంగా కాకుండా, కేవలం మార్కుల వేటగా మారిపోయింది. ఈ ధోరణి విద్యార్థులపై మోయలేని ఒత్తిడిని పెంచుతోంది. తరగతి గది నాలుగు గోడల మధ్య నేర్చుకునే అంశాలు వారి సృజనాత్మకతను వెలికితీసేలా ఉండాలి కానీ, వారిని కేవలం యంత్రాలుగా మార్చకూడదు. పాఠ్యప్రణాళికలో అనవసరమైన భారము తగ్గించి, ప్రయోగాత్మక అభ్యాసానికి పెద్దపీట వేయడం ద్వారా విద్యను ఆనందదాయకంగా మార్చవచ్చు. కేవలం పుస్తకాల్లోని సమాచారాన్ని వల్లె వేయడం వల్ల విద్యార్థులకు లోతైన అవగాహన కలగదు. దీనివల్ల వారు పరీక్షల సమయంలో తీవ్రమైన ఆందోళనకు గురవుతున్నారు. విద్యా విధానం అనేది వారి మేధోవికాసానికి తోడ్పడే విధంగా ఉండాలి.

పరీక్షల నిర్వహణ తీరులో మౌలిక మార్పులు అత్యవసరం. కేవలం సంవత్సరానికి ఒకసారి జరిగే వార్షిక పరీక్షలు విద్యార్థి మేధస్సును, సామర్థ్యాన్ని అంచనా వేయలేవు. మూడు గంటల కాలపరిమితిలో రాసే సమాధానాలు ఆ విద్యార్థి భవితవ్యాన్ని నిర్ణయించడం సమంజసం కాదు. దీనికి ప్రత్యామ్నాయంగా నిరంతర సమగ్ర మూల్యాంకన పద్ధతిని బలోపేతం చేయాలి. విద్యార్థి క్రమశిక్షణ, ఆలోచనా దృక్పథం, సామాజిక స్పృహ, క్రీడలు, కళల పట్ల ఉన్న ఆసక్తిని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. ర్యాంకుల కోసం పరుగు తీయించే విద్యా సంస్థల ధోరణి మారాలి. మార్కుల ఆధారంగా విద్యార్థులను వర్గీకరించడం వారిలో ఆత్మన్యూనతా భావాన్ని కలిగిస్తుంది. ఇది క్రమంగా తీవ్రమైన మానసిక ఆందోళనలకు, విచారకరమైన నిర్ణయాలకు దారితీస్తోంది. విద్యార్థులు తమలోని ప్రత్యేకతలను గుర్తించి, వాటిని మెరుగుపరుచుకునేలా ప్రోత్సహించే వాతావరణం పాఠశాలల్లో ఉండాలి.

బోధనా పద్ధతులలో సాంకేతికతను జోడించి విద్యార్థులకు క్లిష్టమైన అంశాలను సులభంగా అర్థమయ్యేలా వివరించాలి. బట్టీ పట్టే విధానానికి స్వస్తి చెప్పి, విశ్లేషణాత్మక ఆలోచనను ప్రోత్సహించాలి. ప్రతి విద్యార్థిలోనూ ఒక ప్రత్యేక ప్రతిభ ఉంటుంది. దానిని గుర్తించి ప్రోత్సహించే బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉంది. విద్యా ప్రణాళికలో క్రీడలకు, యోగాకు, ప్రాణాయామానికి తగిన ప్రాధాన్యత కల్పించడం ద్వారా విద్యార్థులు ఒత్తిడిని అధిగమించగలరు. పాఠశాలలు కేవలం విజ్ఞాన కేంద్రాలుగానే కాకుండా, విద్యార్థులకు మానసిక ధైర్యాన్ని ఇచ్చే వేదికలుగా మారాలి. భావోద్వేగాలను నియంత్రించుకోవడం, విఫలమైనప్పుడు తిరిగి పుంజుకోవడం వంటి జీవన నైపుణ్యాలను పాఠ్యాంశాల్లో భాగంగా చేర్చాలి.

ఉన్నత విద్యా ప్రవేశ పరీక్షల విషయంలో కూడా సంస్కరణలు రావాలి. ఒకే ఒక పరీక్షపై విద్యార్థి జీవితం ఆధారపడి ఉండేలా కాకుండా, వివిధ అంశాలలో వారి నైపుణ్యాన్ని పరీక్షించేలా బహుళ అవకాశాలు కల్పించాలి. పరీక్షలు అంటే భయం కాకుండా, తమను తాము నిరూపించుకునే ఒక సువర్ణ అవకాశంగా విద్యార్థులు భావించే వాతావరణం ఏర్పడాలి. విద్యార్థుల ఆత్మహత్యలు, మానసిక కుంగుబాటు వంటి వార్తలు విన్నప్పుడు వ్యవస్థలో లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కేవలం చట్టాల ద్వారా కాకుండా, సమాజం ఆలోచనా విధానంలో మార్పు రావడం ద్వారానే సాధ్యమవుతుంది. విద్యా వ్యవస్థ లక్ష్యం కేవలం ఉద్యోగులను తయారు చేయడం కాదు, బాధ్యతాయుతమైన, మానసిక స్థిరత్వం కలిగిన పౌరులను తీర్చిదిద్దడం కావాలి. అప్పుడే ఆరోగ్యకరమైన సమాజం నిర్మాణమవుతుంది. విద్య అనేది భారంగా కాకుండా ఒక బాధ్యతగా సాగినప్పుడే నిజమైన ఫలితాలు అందుతాయి.

# స్థానిక వస్తువులకు గ్లోబల్ బ్రాండింగ్ లక్ష్యంగా ప్రణాళికలు

(సి.హెచ్.ప్రతాప్)



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తయారీ రంగానికి కేంద్రబిందువుగా మారాలనే లక్ష్యంతో ప్రభుత్వం నూతన పారిశ్రామిక విధానాలను అమలు చేస్తోంది. రాష్ట్రంలో తయారయ్యే వస్తువులకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడానికి మరియు ప్రపంచ మార్కెట్‌లో మన బ్రాండ్‌ల సత్తా చాటడానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించింది. ప్రభుత్వం కేవలం రాయితీలు ఇవ్వడమే కాకుండా, పారిశ్రామిక వేత్తలకు అవసరమైన సులభతర వాణిజ్య వాతావరణాన్ని కల్పిస్తోంది. దీనివల్ల నూతన పెట్టుబడులు తరలిరావడమే కాకుండా, స్థానిక ఉత్పత్తులు ప్రపంచ స్థాయికి చేరుకుంటాయి. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ప్రత్యేక ఆర్థిక మండళ్లు మరియు ఎగుమతి ప్రోత్సాహక కేంద్రాలను బలోపేతం చేయడం ద్వారా ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తోంది.

రాష్ట్రంలోని స్థానిక ఉత్పత్తులకు అంతర్జాతీయ బ్రాండింగ్ కల్పించడం ద్వారా ఎగుమతులను ప్రోత్సహించడమే ప్రధాన ఉద్దేశ్యం. విశాఖపట్నం, అమరావతి మరియు తిరుపతి ఆర్థిక ప్రాంతాల్లో "ఉత్పత్తి పరిపూర్ణత క్లస్టర్లను" ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. నాణ్యతలో రాజీ పడకుండా అంతర్జాతీయ ప్రమాణాలతో వస్తువులను తయారు చేయడం ద్వారానే గ్లోబల్ బ్రాండింగ్ సాధ్యమవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం "ఒక కుటుంబం - ఒక వ్యవస్థాపకుడు" అనే వినూత్న కార్యక్రమాన్ని కూడా చేపట్టింది. ఈ పథకం ద్వారా గ్రామీణ స్థాయిలో కూడా పారిశ్రామిక ఆలోచనలను ప్రోత్సహిస్తూ, చిన్న తరహా పరిశ్రమలను గ్లోబల్ సప్లై చైన్‌తో అనుసంధానించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.



పారిశ్రామిక కారిడార్లకు లాజిస్టిక్స్ అనుసంధానం చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. విశాఖ-చెన్నై, చెన్నై-బెంగళూరు మరియు హైదరాబాద్-బెంగళూరు వంటి కీలక పారిశ్రామిక కారిడార్లకు రోడ్డు, రైలు మరియు నౌకాశ్రయ మార్గాలను అనుసంధానించడం ద్వారా రవాణా సౌకర్యాలను మెరుగుపరుస్తోంది. దీనివల్ల వస్తువుల తరలింపు సులభతరం కావడమే కాకుండా, రవాణా ఖర్చులు గణనీయంగా తగ్గుతాయి. రవాణా వ్యయం తగ్గితేనే అంతర్జాతీయ మార్కెట్‌లో మన ఉత్పత్తులు ఇతర దేశాల వస్తువులతో పోటీ పడగలవు. మల్టీ మోడల్ లాజిస్టిక్స్ పార్కుల ఏర్పాటు ద్వారా సరుకు రవాణా సమయాన్ని తగ్గించి, ఎగుమతిదారులకు అదనపు లబ్ధి చేకూరుస్తోంది.

సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 175 ఎం.ఎస్.ఎం.ఇ పార్కులను క్లస్టర్ల వారీగా అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఈ యూనిట్లకు అవసరమైన విద్యుత్, నీరు మరియు మౌలిక సదుపాయాలను కల్పించడమే కాకుండా, కోల్డ్ స్టోరేజ్ మరియు గిడ్డంగి సౌకర్యాలను లాజిస్టిక్స్ పార్కులతో అనుసంధానం చేస్తోంది. "భారత్ పారిశ్రామిక వికాస యోజన" పథకం కింద పారిశ్రామిక మరియు రసాయన పార్కులను ఏర్పాటు చేస్తూ తయారీ రంగాన్ని బలోపేతం చేస్తోంది. పర్యావరణహిత పారిశ్రామిక విధానాలను పాటిస్తూనే, తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఉత్పత్తిని సాధించేలా సాంకేతిక సహాయాన్ని అందిస్తోంది.

నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు శిక్షణ ఇచ్చేందుకు విశ్వవిద్యాలయాల్లో హైబ్రిడ్ మోడ్ కోర్సులను ప్రవేశపెడుతోంది. క్లస్టర్ల వద్ద పారిశ్రామిక టౌన్‌షిప్‌లను నిర్మించడం ద్వారా కార్మికులకు వసతి సౌకర్యాలను కల్పిస్తోంది. తద్వారా పారిశ్రామిక మౌలిక సదుపాయాలు మెరుగుపడటమే కాకుండా ఉత్పత్తి సామర్థ్యం కూడా పెరుగుతుంది. పరిశ్రమలకు కావలసిన మానవ వనరులను స్థానికంగానే అందుబాటులోకి తెస్తూ, పరిశ్రమలు మరియు విద్యాసంస్థల మధ్య సమన్వయాన్ని పెంచుతోంది. ఈ సమగ్ర వ్యూహాల ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను అంతర్జాతీయ తయారీ హబ్‌గా మార్చాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది.

# శక్తికి సంకేతం నిమ్మకాయలు

## అమ్మవార్లకు శాంతి... మానవాళికి రక్షణ

పుట్టా శ్రీనివాసరావు

ప్రతి ఒక్కరూ నిజజీవితంలో నిమ్మకాయలను ఎక్కువగా వినియోగిస్తారు. అయితే ఆ నిమ్మకాయకి ఎంత శక్తి ఉందో మనవాళ్ళకి ఎంత ఉపయోగముందో ఒక్కసారి పరిశీలిద్దాం. శక్తికి సంకేతంగా పిలవబడే ఈ నిమ్మకాయలు అమ్మవార్లకు శాంతిని ఇస్తాదంటారు. గ్రామదేవతలకు నిమ్మకాయల మాల అంటే ఎంతో ఇష్టం

అమ్మవారి స్వరూపాలైన దుర్గమ్మ, భద్రకాళి, గ్రామ దేవతలైన మోదకొండమ్మ, మరిడమ్మ నూకాలమ్మ, దుర్గమ్మ, వివిధ రూపాల్లో కొలువైయున్న దేవతలు అందరికీ నిమ్మకాయల మాల అంటే ఎంతో ఇష్టం. నిమ్మకాయ "శక్తి" కి సంకేతం.మనలో ఉన్న దిష్టి, ప్రతికూల శక్తి , దుష్ట ప్రభావాలను పీల్చుకునే శక్తి నిమ్మకాయకు ఉంటుంది. అందుకే అమ్మవారిని శాంతింపజేయడానికి, మనల్ని రక్షించుకోవడానికి ఈ మాల వేస్తారు.

**ఎన్ని నిమ్మకాయలు వేయాలి....**

సాధారణంగా మీ మొక్కుబడిని బట్టి లేదా సమస్య తీవ్రతను బట్టి 11, 21, 51, లేదా 108 నిమ్మకాయలతో మాల కట్టి సమర్పిస్తారు.

108 నిమ్మకాయల మాల అత్యంత శక్తివంతమైనదిగా పరిగణించ బడుతుంది. ఈ దండను

శుక్రవారం వేస్తే సౌభాగ్యం , లక్ష్మీ కటాక్షం లభిస్తది. అదే

మంగళవారం రాహుకాలంలో మధ్యాహ్నం 3:00 నుండి 4:30 మధ్య సమయంలో దుర్గాదేవికి వేస్తే రాహు దోషాలు, పెళ్లి సంబంధాల్లో అడ్డంకులు తొలగుతాయి.

ఆదివారం తీవ్రమైన దిష్టి దోషాలు, శత్రు బాధల నివారణ అవుతాయి.

**దీని వెనుక ఉన్న కారణం ఏంటి..**

పురాణాల ప్రకారం అమ్మవారు రాక్షస సంహారం చేసినప్పుడు కలిగిన ఉగ్రతను(వేడిని), శాంతింపజేయడానికి భక్తులు చలువ చేసే నిమ్మకాయలను మాలగా వేశారు. నిమ్మకాయలోని పులుపు "అహంకారాన్ని" హరిస్తుంది. అమ్మవారికి ఈ మాల వేయడం వల్ల ఆమె శాంతించి, కోరిన వరాలు ఇస్తుందని భక్తుల నమ్మకం.

**పూజా విధానం ః ఎన్ని రోజులు ఉంచాలి..**

ఎలా వేయాలి..

మచ్చలు లేని, పండని (పచ్చగా లేదా పసుపుగా ఉన్న) స్వచ్ఛమైన నిమ్మకాయలను తీసుకోవాలి. ఎర్రటి దారంతో మాలగా కట్టి అమ్మవారి మెడలో వేయాలి. అమ్మవారి విగ్రహానికి వేస్తే అవి వాడిపోయే వరకు (2-3 రోజులు) ఉంచవచ్చు. ఫోటోకి అయితే మరుసటి రోజే తీసేయడం మంచిది.

**తీసిన నిమ్మకాయలను**

మాల తీసిన తర్వాత ఆ నిమ్మకాయలు ఎవరి పాదాలకు తగలకుండా చూడాలి.వాటిని ప్రవహించే నీటిలో (కాలువ లేదా నది) కలపాలి. లేదా ఎవరూ తొక్కని చోట, ఏదైనా చెట్టు మొదట్లో వేయాలి. దేవుడి మెడలో వేసిన నిమ్మకాయలను వంటల్లో వాడకూడదు, తినకూడదు. ఎందుకంటే అవి మీలోని నెగటివ్ ఎనర్జీని గ్రహించి ఉంటాయి.

అమ్మవారి మెడలో వేసిన మాలలోని కాయలను బండికి కట్టకూడదు. కొత్తగా కోసిన నిమ్మకాయలను (దృష్టి కోసం) విడిగా బండికి కట్టుకోవచ్చు.



గుడిలో ఇచ్చే నిమ్మకాయ (ప్రసాదం)

**విశిష్టత**

మెడలో వేసిన మాల వేరు, అమ్మవారి పాదాల చెంత ఉంచి పూజ చేసిన నిమ్మకాయ వేరు.అమ్మవారి పాదాల దగ్గర ఉంచి, మంత్రోచ్ఛారణతో పూజించిన నిమ్మకాయలో "సకల శక్తి" ఉంటుంది.పూజారి ఆ కాయను మీకు ఇస్తే, అది అమ్మవారి ఆశీర్వాదంగా భావించాలి.

**తల దగ్గర ఎందుకు పెట్టుకోవాలి..**

నిద్రలేమి, భయం, రాత్రిపూట పీడకలలు వచ్చే వారికి లేదా అనవసరమైన భయాలు ఉన్నవారికి, ప్రసాదంగా వచ్చిన నిమ్మకాయను తలగడ కింద (లేదా తల పక్కన) పెట్టుకోమని చెబుతారు. ఇది ఒక రక్షణ కవచంలా పనిచేసి, మీ చుట్టూ ఉన్న నెగటివ్ ఎనర్జీని దరిచేరనీయదు.

**నిమ్మరసం కలుపుకుని తాగవచ్చా..**

అవును, తాగవచ్చు, గుడిలో ప్రసాదంగా ఇచ్చిన నిమ్మకాయను నీళ్లలో కలుపుకుని తాగడం వల్ల శరీర శుద్ధి జరుగుతుంది.అమ్మవారి శక్తి ఆ కాయలో ఉంటుంది కాబట్టి, అది మన శరీరంలోకి వెళ్తే అనారోగ్య సమస్యలు తొలగిపోయి, మనస్సు ప్రశాంతంగా మారుతుందని నమ్మకం.

అయితే మాలలోని వేసిన కాయలను తాగకూడదు, కేవలం ప్రసాదంగా ఇచ్చిన ఒక్క కాయను మాత్రమే తాగాలి.బయటకు

ఏదైనా ముఖ్యమైన పని మీద లేదా ప్రయాణాలకు వెళ్లేటప్పుడు ప్రసాదం నిమ్మకాయను జేబులోనో లేదా బ్యాగులోనో ఉంచుకుంటే "దిష్టి" తగలకుండా ఉంటుంది. ఎదుటివారి కళ్ళు మన మీద పడకుండా మనం వెళ్లే పని విజయవంతం అవ్వడానికి ఇది ఒక రక్షణగా పనిచేస్తుంది. అయితే ఇంట్లో అమ్మవారికి నిమ్మకాయల మాల వేసేటప్పుడు కొన్ని ముఖ్యమైన నియమాలు పాటించాలి. గుడిలో వేయడానికి, ఇంట్లో వేయడానికి చిన్న తేడా ఉంటుంది.

**ఇంట్లో వేసేటప్పుడు పాటించాల్సిన నియమాలు..**

మచ్చలు లేని, కుళ్లిపోని తాజా నిమ్మకాయలను మాత్రమే వాడాలి.

ఇంట్లో వేసేటప్పుడు సాధారణంగా 11 లేదా 21 కాయలతో వేయడం మంచిది. (108 అనేది గుళ్ళలో లేదా పెద్ద పూజలప్పుడు వేస్తారు).

ఎర్రటి దారంతో మాల కట్టాలి. సూదితో కాయలను గుచ్చవచ్చు, కానీ ఆ సూది కొత్తదై ఉండాలి (వాడిన సూది వాడకూడదు) లేదా అమ్మవారికి సంబందించినవి వేరుగా వాడాలి.

శుక్రవారం ఉదయం లేదా మంగళవారం రాహుకాలంలో వేయడం అత్యంత శుభప్రదం.

**ఇంట్లో ఎన్ని రోజులు ఉంచాలి..ఎప్పుడు తీసేయాలి..**

ఇది చాలా ముఖ్యం

ఇంట్లో నిమ్మకాయల మాల ఒక్క రోజు లేదా గరిష్టంగా రెండు రోజులు మాత్రమే ఉంచాలి.

కాయలు నల్లగా మారుతున్నా లేదా వాడిపోతున్నా వెంటనే తీసేయాలి. ఎందుకంటే అవి ఇంట్లోని నెగటివ్ ఎనర్జీని పీల్చుకుంటాయి. అవి అలాగే ఉంటే ఆ నెగటివ్ ఎనర్జీ మళ్ళీ ఇంట్లోనే ఉంటుంది.

ఇంట్లో అమ్మవారికి వేసిన మాలలోని కాయలను అస్సలు వంటల్లో వాడకూడదు, తినకూడదు.

ప్రసాదంగా తెచ్చుకున్న నిమ్మకాయ ఎండిపోయినా లేదా కుళ్ళిపోయినా వెంటనే దానిని నీటిలో కలిపేయాలి లేదా చెట్టు కింద వేయాలి. ఎందుకంటే అది మీలోని దోషాన్ని తీసేసుకుందని అర్థం.చాలామంది నిమ్మకాయలను పారేయాలి అనుకుంటారు.కానీ అమ్మవారి పాదాల దగ్గర పూజించిన నిమ్మకాయ మహా ప్రసాదం.భయం పోవాలంటే తల కింద పెట్టుకోండి.

ఆరోగ్యం కోసం ప్రసాదంగా స్వీకరించండి.

విజయం కోసం బయటకు వెళ్లేటప్పుడు వెంట తీసుకెళ్లండి.

మాలలోని కాయలను దిష్టి నివారణకు వాడితే, ప్రసాదం కాయను మాత్రం శక్తి కోసం వాడాలి.మంగళ, శుక్రవారాల్లో అమ్మవారికి నిమ్మకాయల మాల వేయడం వల్ల ఇంట్లో ఉన్న దారిద్ర్యం, దిష్టి దోషాలు తొలగిపోతాయి. ముఖ్యంగా రాహుకాలంలో దుర్గమ్మకు 21 నిమ్మకాయల మాల వేసి చూడండి.. మీ పనుల్లో ఉన్న ఆటంకాలు ఎలా తొలగిపోతాయో! గుర్తుంచుకోండి.. మాల తీశాక ఆ కాయలను వంటల్లో వాడకూడదు, వాటిని చెట్టు కింద మాత్రమే వేయాలి.

అమ్మవారికి నిమ్మకాయల మాల వేయడం వల్ల ఇంట్లో ఉన్న చికాకులు, దిష్టి దోషాలు తొలగిపోతాయి.అయితే ఇంట్లో వేసిన మాలను కాయలు వాడిపోయే వరకు ఉంచకూడదు. ఒక్క రోజు ఉంచి తీసేయడం వల్ల ఫలితం ఎక్కువగా ఉంటుంది. అలాగే మాల తీశాక ఆ కాయలను పొరపాటున కూడా వంటల్లో వాడకండి. వాటిని ప్రకృతిలో కలిపేయండి. ఈ నేపథ్యంలో నిమ్మకాయల విశిష్టతను తెలుసుకొని ఉపయోగించాలని జ్యోతిష్య నిపుణులు కోరుకొండ సర్వేశ్వరరావు సూచిస్తున్నారు.

# దక్షిణ కోస్తాలో కేకే కోసం ఉద్యమిస్తాం

**చంద్రబాబు అసమర్థత వల్లే కెకె లైన్‌ను కోల్పోయాం**

**విభజన చట్టంలో ఇచ్చిన హామీకి కేంద్రం తూట్లు పొడిచింది**

**చంద్రబాబుకి అమరావతి రియల్ ఎస్టేట్ వ్యాపారమే ముఖ్యమా?**

**అమరావతి కోసం విశాఖ అభివృద్ధిని పణంగా పెడుతున్నాడు**

**చంద్రబాబు తీరుపె జిల్లా వైయస్సార్సీపీ అధ్యక్షుడు కెకె రాజు**



**విశాఖపట్నం, మే 5, జయ జయహే :**

కె=త్తవలస- కిరండూల్ (కేకే) లైన్ లేకుండా విశాఖ రైల్వేజోన్ ప్రకటించడం చనిపోయిన బిడ్డను చేతిలో పెట్టినట్టుగా ఉందని, ఒడిశాలో బీజేపీ బలోపేతం కావడం కోసం ఏపీకి అన్యాయం చేస్తుంటే చంద్రబాబు నోరెత్తడం లేదని విశాఖ జిల్లా వైయస్సార్సీపీ అధ్యక్షుడు కెకె రాజు మండిపడ్డారు. విశాఖలోని పార్టీ సిటీ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు అసమర్థ, స్వార్థపూరిత విధానాల కారణంగా విశాఖతోపాటు ఉత్తరాంధ్ర ప్రాంతం తీవ్రంగా నష్టపోతోందని, ఇప్పుడు కెకె లైన్ లేకుండా చేసినా ఆయనలో చలనం లేకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. కెకె లైన్, అరకు, కోరాపూట్ వంటి టూరిజం ప్రాంతాలు లేకుండా కేంద్రం ప్రకటించిన విశాఖ రైల్వేజోన్ రాష్ట్రానికి గుదిబండగా మారుతుందని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విభజన చట్టంలో ఉన్న విశాఖ రైల్వే జోన్ హామీకి తూట్లు పొడుస్తుంటే కూటమి ఎంపీలు స్వీట్లు పంచుకుని సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటన్నారు. అమరావతి రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం విశాఖ అభివృద్ధిని చంద్రబాబు పణంగా పెడుతున్నాడని మండిపడ్డారు. కెకె లైన్‌తో కూడిన విశాఖ రైల్వేజోన్ ఏర్పాటు కోసం వైయస్సార్సీపీ ఉద్యమిస్తుందని, విశాఖ అభివృద్ధిని కోరుకునే ఉత్తరాంధ్ర కూటమి నాయకులు తమతో కలిసి రావాలని కెకె రాజు పిలుపునిచ్చారు.

**ఆయన ఇంకా ఏమన్నారంటే...**

విశాఖ రైల్వే జోన్ ఉత్తరాంధ్రవాసుల కల. విభజన చట్టంలో రాష్ట్రానికి ప్రత్యేక హోదాతోపాటు విశాఖకు రైల్వేజోన్ అంశాన్ని కూడా స్పష్టంగా పొందుపరిచారు. 2014 ఎన్నికల్లో తెలుగుదేశం, బీజేపీ, జనసేన కలిసి ఒక జట్టుగా ఏర్పడి విశాఖ నడిబొడ్డున ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించిన సభలో కూడా దీనిపై మూడు పార్టీల నాయకులు స్పష్టమైన ప్రకటన చేశారు. నరేంద్ర మోడీ, పవన్ కళ్యాణ్, చంద్రబాబు కలిసి పాల్గొన్న ఈ సభలో మా కూటమిని గెలిపించి అధికారంలోకి తీసుకొస్తే ఉత్తరాంధ్ర ప్రజల కలలు నెరవేర్చే విధంగా విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్నాళ్లు కలిసున్న మూడు పార్టీలు తర్వాత విడిపోయి ఒకరినొకరు తిట్టుకోవడం మొదలుపెట్టారు. ఐదేళ్లు అధికారం చెలాయించారే కానీ ఇచ్చిన హామీలను మాత్రం గాలికొదిలేసి ఉత్తరాంధ్ర ప్రజలను తీవ్రంగా వంచించారు. 2014-19 మధ్య ప్రతిపక్ష వైయస్సార్సీపీ ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు చేశాం. కండితుడుపు చర్యగా 2019 ఎన్నికలకు నెలరోజుల ముందు విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు చేస్తున్నట్టు తూతూమంత్రంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రకటించింది. 2019లో వైయస్సార్సీపీ అధికారంలోకి వచ్చాక విశాఖ రైల్వే జోన్ ఏర్పాటుకు కేంద్రంతో మాట్లాడి స్థలాన్ని కూడా కేటాయించారు. దురదృష్టవశాత్తు 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి రైల్వే జోన్ విషయంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు ఉత్తరాంధ్ర ప్రజలను తీవ్ర నిరాశకు గురిచేస్తున్నాయి. ఈ సమావేశం లో నియోజకవర్గం సమన్వయ కర్త తిప్పల శ్రీనివాస్ దేవన్ రెడ్డి , మొల్లి అప్పారావు , జిల్లా పార్టీ కార్యాలయం పర్యవేక్షకులు రవి రెడ్డి , డిప్యూటీ మేయర్ కట్టమూరి సతీష్ , రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీ , మాజీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షులు జీల కర్ర నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు

# దోనివానిలక్ష్మీపురంలో గో బంద పరిశీలన

**నక్కపల్లి (జయ జయహే)**



నక్కపల్లి మండలం,దోనివానిలక్ష్మీపురంలో గల సర్వే నెంబర్ 81 లో 91 ఎకరాలలో గల గో బంద్ ను ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ప్లాంట్ యాజమాన్యం అక్రమంగా ఆక్రమించి దానికి ప్రయత్నిస్తుందని, దీనిని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మాజీ సర్పంచ్ కిల్లాడ రామకృష్ణ ఆధ్వర్యంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జీ.కోటేశ్వరరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు లు గ్రామస్తులతో కలిసి గో బందను పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ గోబందలో దోనివానిలక్ష్మీపురం గ్రామానికి చెందిన పశువులు, గొర్రెలు, మేకలు మేపుకోవడానికి, నీరు పెట్టడానికి పూర్వం నుండి ఉపయోగిస్తున్నారు, అంతే దోనివాని లక్ష్మీ పురం మత్స్యకారులు చేపలు వేట చేసుకుని కుటుంబాలు పోషించుకుంటున్నారు. అంతేకాకుండా పర్యావరణాన్ని కాపాడటంలో ఇటువంటి గో బందలు, చిత్తడి నేలలు ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉంటున్నాయి. వాతావరణం లో సమతుల్యత దెబ్బతినకుండా కాపాడుతూ ప్రకృతి వైపరీత్యాల సంభవించకుండా, సునామీ లు,భూ కంపాలూ రాకుండా కాపాడటంలో ప్రముఖ మైన పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ప్లాంట్ కు ఏలేరు, గోదావరి ఎడమ కాలువ నుండి నీరు తీసుకుని వాడుకోవడం కొరకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని సామాజిక ప్రభావ అంచనా నివేదిక లో పొందు పరిచారని అటువంటిది గో బందను మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఎలా ఉపయోగిస్తారని ప్రశ్నించారు. ఇక్కడ కు దేశీయ, విదేశీ పక్షులు వచ్చి జీవిస్తూ పునరుత్పత్తి చెందుతూ ఉ ంటాయని పర్యావరణాన్ని కాపాడటంలో ఇవి కీలక భూమిక పోషిస్తాయని తెలిపారు, ఇప్పటికే పర్యావరణంలో సమతుల్యత దెబ్బతినడం వలన ప్రక్రృత్తి విపత్తులు సంభవిస్తున్నాయని తెలిపారు, ఇటువంటి సమయంలో అంతటి ప్రాముఖ్యత కలిగిన ఈ గో బందను కాపాడటానికి పర్యావరణ పరిరక్షణ వేత్తలు ముందు కు రావాలని ఈ గో బందపై సర్వ అధికారులు దోనివానిలక్ష్మీపురం గ్రామస్తులకు చెందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు ఎం.సత్యనారాయణ,క్రృష్ణంరాజు,ఎ.శివ,కె.నానాజీ,కె.అప్పల నాయుడు,జీ.గోవింద్,డి.సత్తిబాబు,పి.అజయ్,పి.నానాజీ,డి.వ ఖసలయ్య తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ హితంగా ప్రతి ఒక్కరూ జీవించాలి






**- గాలి,నీరు, భూమి కాలుష్యం కాకుండా చూసుకోవాలి**

**- సామాజిక వనాలు విస్తారంగా పెంచాలి**

**- ప్రతి ఒక్కరూ పది మొక్కలు నాటి పెంచాలి**

**- బి వీరేంద్ర, అసిస్టెంట్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్**

**సబ్బవరం (జయ జయహే)**

పర్యావరణ హితంగా ప్రతి ఒక్కరూ జీవించాలి అని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి అసిస్టెంట్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ బి వీరేంద్ర పిలుపునిచ్చారు. సబ్బవరం లో దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయం లో ఎన్ సి సి 13వ బెటాలియన్ క్యాంపు లో లెఫ్ట్ నెంట్ కల్నల్ స్వర్ణిం ప్రభాత్ అధ్యక్షతన, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ నేతృత్వంలో 600 మంది విద్యార్థులతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మనం పీల్చే గాలినీ, మనం త్రాగే నీటిని, మనం నివసించె భూమినీ కాలుష్యం కాకుండా చూసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ పది మొక్కలు నాటి పెంచాలని కోరారు. సామాజిక వనాలు విస్తారంగా పెంచాల్సిన బాధ్యత మానవాళిదే అని వివరించారు.గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం మాట్లాడుతూ సమస్త జీవరాశినీ కాపాడటమే మానవత్వం అన్నారు. దీని వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. మారిషస్ లో డోడో పక్షులు వేటాడి తినడం వల్ల డోడో పక్షి పుట్టుక ఆగి పోయింది అని వివరించారు. మనిషి జీవులు గూడు నేయలేదని, భూమి మీద ఉన్న జీవుల గూడు లో మనిషి ఒక భాగం మాత్రమే అనె ముఖ్యాంశాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించి సమస్త జీవులు రక్షణకు కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ఎస్ వి గోవింద రావు, అసోసియేషన్ ఆఫ్ పీపుల్స్ పవర్ సంస్థ ప్రతినిధి నిమ్మకాయల భాస్కర్, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ ఇంటెర్న్ షిప్ విద్యార్థిని నందిని రోయ్, ఎన్ ఎస్ ఐ ఆర్ టి విద్యార్థులు పాల్గొన్నారు. గోవర్ధన పురం గోశాల ప్రతినిధి దొడ్డ మహేష్ అందజేసిన పిచ్చుకల గూళ్ళు, మట్టి పాత్రలు విద్యార్థులకు పంపిణీ చేశారు.



## సుమన్ ట్యూటోరియల్స్‌కు పాలిసెట్‌లో రాష్ట్ర ర్యాంకులు

**ర్యాంకర్లను అభినందించిన వ్యవస్థాపక ఛైర్మన్ సుమన్ ప్రకాశం**

**ఘనంగా సక్సెస్ మీట్ నిర్వహణ**

**విశాఖపట్నం, మే 5, జయ జయహే**

విశాఖ మహా నగరంలోని మురళీనగర్ ఈస్ట్ అయ్యప్పనగర్‌లో ఉన్న సుమన్ ట్యూటోరియల్స్‌కు పాలిసెట్‌లో ర్యాంకులు పంట పండింది. మంగళవారం విడుదలైన ఫలితాల్లో ఏటా మాదిరి గానే ఈ ఏడాది కూడా ఉత్తమ ర్యాంకులతో విద్యార్థులు మెరిసారు. ట్యూటోరియల్స్ నుంచి హాజరైన వారంతా 100 శాతం ఉ త్తీర్ణతతో 10 వేల లోపు ర్యాంకులను సొంతం చేసుకున్నారు. ఎస్ దినేష్ కుమార్ 465 ర్యాంకు సాధించి ఉత్తమ విద్యార్థిగా ఎంపికయ్యాడు. అలాగే సాయితేజ 1027, విద్వాన్ 2280, వరుణ్ 4298, శివ దీపక్ 8373, రసజ్ఞ 9310, వైభవ్ 10,673, మోహన్ 10,798 రాష్ట్ర ర్యాంకులను కైవసం చేసుకున్నారు. ఉత్తమ ర్యాంకులు పొందిన అభ్యర్థులందరినీ ట్యూటోరియల్స్ వ్యవస్థాపక ఛైర్మన్ ఆర్ సుమన్ ప్రకాశం సక్సెస్ మీట్ నిర్వహించి అభినందించారు. ట్యూటోరియల్స్ నుంచి హాజరైన దాదాపు 68 మందికి ప్రభుత్వ కాలేజీల్లో మంచి సీట్లు వస్తాయని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. తక్కువ వ్యవధిలో ఉత్తమ ఫలితాలు రాబట్టడంలో ప్రిన్సిపాల్ దేవరాజ్, వైస్ ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, మ్యాథ్స్ ఫ్యాకల్టీ బాబూరావు, పద్మ, ఫిజిక్స్ శాస్త్రి, సుబ్రహ్మణ్యం, అజయ్, అవినాష్‌లను అభినందించారు.




## మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు కృషి ప్రశంసనీయం

**శ్రీనిధి డిప్యూటీ జనరల్ మేనేజర్**

**అమరావతి,మే 5 (జయ జయహే )**

మహిళల ఆర్థిక ఎదుగుదలకు ప్రభుత్వంతోపాటు సేవా సంస్థలు చేస్తున్న కృషి ప్రశంసనీయమని,మహిళలు అన్ని రంగాలలో రాణించాలని పల్నాడు,గుంటూరు,బాపట్ల కృష్ణా జిల్లాల శ్రీనిధి డిప్యూటీ జనరల్ మేనేజర్ మండే ధర్మేంద్ర అన్నారు.మండల కేంద్రమైన అమరావతిలో ల్యాంప్ ,జన చైతన్య సమితి (జె సి ఎస్)స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో జ్యూట్ తో పలు రకాల వస్తువుల తయారీపై శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు మంగళవారం సర్టిఫికెట్లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి ల్యాంప్ సంస్థ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్ పాల్ అధ్యక్షత వహించారు. ఈకార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ధర్మేంద్ర మాట్లాడుతూ మహిళలు స్వశక్తితో ఎదిగేందుకు ల్యాంప్,జె సి ఎస్ స్వచ్ఛంద సంస్థలు ఇచ్చిన శిక్షణను ఉపయోగించుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలను పారిశ్రామికవేత్తలుగా ఎదగాలననే లక్ష్యంతో చేయూతనందిస్తుందన్నారు. గుంటూరు జిల్లా శ్రీనిధి అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వెంకటరమణ మాట్లాడుతూ మహిళలు శిక్షణ పొంది ఖాళీగా ఉండకుండా ప్లాస్టిక్ కు వ్యతిరేకంగా నేర్చుకున్న జ్యూట్ బ్యాగుల ద్వారా లబ్ధి పొందాలన్నారు.ల్యాంప్ సంస్థ డైరెక్టర్ సాల్మన్ పాల్ మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లాలో మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు జూట్ పై ఉచితంగా శిక్షణ ఇస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో జన చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసరి విజయ్ బెన్నిబాబు,ల్యాంపు సంస్థ ప్రతినిధులు తురక మంగయ్య,కొండపల్లి వెంకటేశ్వరరావు,షేక్ బాజీ, జనచైతన్య సమితి కార్యదర్శి తుళ్లూరు సాంబశివరావు,షేక్ సుభాని,బెజ్జం నాగేశ్వరరావు, శిక్షకురాలు జుబేదా ఖాతున్, తదితరులు పాల్గొన్నారు. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లను పంపిణీ చేశారు.

## మంత్రికి ఉత్తం కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపిన జువ్వాడి

**కోరుట్ల (జయ జయహే)**



కోరుట్ల నియోజకవర్గం గుండా ప్రవహించే శ్రీరాంసాగర్ వరద కాలువ గేట్ల అత్యవసర నిర్వహణ కోసం డీజిల్ జనరేటర్కు 49 లక్షల రూపాయలు మెట్పల్లి ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయ నిర్మాణం కోసం 92 లక్షల రూపాయలు మంజూరయ్యాయని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు పత్రిక విలేకరులకు తెలిపారు కోరుట్ల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జువ్వడి నర్సింగరావు ప్రత్తిపాదన మేరకు మంజూరు అయినఈ నిధులతో ఇరిగేషన్ కార్యాలయం నిర్మాణం పూర్తి చేయాలని అదేవిధంగా జనరేటర్ వెంటనే కొనుగోలు చేయాలని అధికారులను కోరారు నిధులు మంజూరు చేసిన రాష్ట్ర భారీ మధ్యతరహానీటి పారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్ ఉత్తంకుమార్ రెడ్డి కి జువ్వడి కృష్ణారావు కృతజ్ఞతలు తెలిపారు



## మెరుగైన కంటి చూపు కోసం
# ఇవి తినాల్సిందే

నేటి ఆధునిక ప్రపంచంలో, మన కంటి ఆరోగ్యాన్ని దెబ్బతీసే డిజిటల్ తెరలు, కృత్రిమ లైటింగ్లతో మనం నిరంతరం కంటిని ఇబ్బందికి గురి చేస్తూనే ఉన్నాము. మన కళ్ళను జాగ్రత్తగా చూసుకోవడం, అవి ఉత్తమంగా పనిచేయడానికి అవసరమైన పోషకాలను అందిస్తున్నట్లు చూసుకోవడం చాలా ముఖ్యం. మన కంటి ఆరోగ్యానికి తోడ్పడటానికి ఉత్తమ మార్గాలలో ఒకటి మన భోజనంలో కొన్ని ఆహారాలను చేర్చడం ద్వారా మెరుగైన కంటి దృష్టి, కంటి ఆరోగ్యాన్ని ప్రోత్సహించడంలో సహాయపడవచ్చు. క్యారెట్లు, బచ్చలికూర, సాల్మన్, బ్లూబెర్రీలు, బాదం వంటి ఆహారాలను చేర్చడం ద్వారా మీరు మీ కళ్ళకు ఉత్తమంగా పనిచేయడానికి అవసరమైన పోషకాలను అందించవచ్చు. మీ ఆహారం ద్వారా మీ కంటి ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవడం అనేది రాబోయే సంవత్సరాల్లో మీ దృష్టికి మద్దతు ఇవ్వడానికి సరళమైన, ప్రభావవంతమైన మార్గం.

**క్యారెట్లు:**
కంటి ఆరోగ్యం విషయానికి వస్తే.., క్యారెట్లు తరచుగా గుర్తుకు వచ్చే మొదటి ఆహారం. ఈ ప్రసిద్ధ మూల కూరగాయలలో బీటా %-% కెరోటిన్ పుష్కలంగా ఉంటుంది. ఇది విటమిన్ %ూ% ని పుష్కలంగా అందిస్తుంది. మంచి దృష్టి కోసం విటమిన్ %ూ% అవసరం. ఎందుకంటే, ఇది రెటీనా సరిగ్గా పనిచేయడానికి సహాయపడుతుంది. క్యారెట్లలో లూటిన్, జియాక్సాంటిన్ అనే రెండు యాంటీఆక్సిడెంట్లు కూడా ఉంటాయి. ఇవి హానికరమైన నీలి కాంతి నుండి కళ్ళను రక్షించడంలో సహాయపడతాయి.

**బచ్చలికూర:**
కంటి ఆరోగ్యం విషయానికి వస్తే బచ్చలికూర మరొక పవర్ హౌస్. ఈ ఆకుపచ్చ ఆకు లూటిన్, జియాక్సాంటిన్ తో నిండి ఉంటుంది. ఇది వయస్సు సంబంధిత మాక్యులర్ డిజెనరేషన్ నుండి కళ్ళను రక్షించడంలో సహాయపడుతుంది. బచ్చలికూరలో విటమిన్ %జ% కూడా ఉంటుంది. ఇది యాంటీఆక్సిడెంట్, ఇది కంటిశుక్లం ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది.

**బ్లూబెర్రీస్:**
బ్లూబెర్రీస్ యాంటీఆక్సిడెంట్ లక్షణాలకు ప్రసిద్ధి చెందాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడి నుండి కళ్ళను రక్షించడంలో సహాయపడతాయి. ఈ రుచికరమైన బెర్రీలలో ఆంథోసైనిన్లు ఉంటాయి. ఇవి రాత్రి దృష్టిని మెరుగుపరచడానికి, కళ్ళను దెబ్బతినకుండా రక్షించడానికి సహాయపడే సమ్మేళనాలు. మీ ఆహారంలో బ్లూబెర్రీస్ ను చేర్చడం వల్ల కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది.

**బాదం:**
బాదం విటమిన్ %జు% యొక్క గొప్ప మూలం. ఇది యాంటీఆక్సిడెంట్. ఇది వయస్సు సంబంధిత నష్టం నుండి కళ్ళను రక్షించడంలో సహాయపడుతుంది. విటమిన్ %జు% కంటిశుక్లం, మాక్యులర్ డిజెనరేషన్ ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. ఇవి దృష్టిని ప్రభావితం చేసే రెండు సాధారణ కంటి పరిస్థితులు. మీ ఆహారంలో బాదంపప్పును చేర్చడం మొత్తం కంటి ఆరోగ్యానికి సహాయపడుతుంది.

# తమిళ ప్రజలకు అభినందనలు

**విశాఖపట్నం, మే 4: (జయ జయహే)**

కులమతాలకు అతీతంగా సామాన్య వ్యక్తి హీరో విజయ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించిన తమిళనాడు ప్రజలకు భారత సమాజ్ డెవలప్ పార్టీ జాతీయ అధ్యక్షులు, మై ఇండియన్ ట్రస్ట్ ఆంధ్రప్రదేశ్ ఇంచార్జి చింతాడ సూర్యం అభినందనలు తెలిపారు. తమ జాతీయ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ "తమిళ ప్రజలు ప్రదర్శించిన విజ్ఞత, మార్పు దిశగా వేసిన అడుగు అభినందనీయం. ప్రతి రాష్ట్రం కూడా కులమతాలకు అతీతంగా ఆలోచించాలి. న్యాయబద్ధమైన ఓటును న్యాయంగానే వినియోగించాలి" అని సూచించారు. ఓటుకు నోటు పద్ధతిలో వెళితే ఏ దేశం , ఏ రాష్ట్రం అభివృద్ధి చెందదు" అని సూర్యం స్పష్టం చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ సమాజంలో మార్పు, నవ సమాజం, సమ సమాజం అనే ఆలోచనలు ప్రజల్లో రావాలని పిలుపునిచ్చారు. "తమిళ ప్రజలు తీసుకొచ్చిన మార్పు మహా గొప్పది, విలువైనది. అదే మార్పు అతి త్వరలో తెలుగు రాష్ట్రాల్లోనూ వస్తుందని విశ్వసిస్తున్నాం" అని ఆయన అన్నారు. మై ఇండియన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భారత సమాజ్ డెవలప్ పార్టీ వృద్ధులు, వితంతువులు, పేద ప్రజలకు పెన్షన్లు, విద్య, వైద్య సదుపాయాలు అందించడంతో పాటు విద్యార్థుల విద్య కొనసాగేలా వసతి సహకారాలు అందజేయనున్నట్లు చింతాడ సూర్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## ఘనంగా లక్ష్మీ గణపతి హోమం

**చోడవరం, మే 5 జయ జయ హే**

చోడవరంలో గల స్వయంభూ శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి సన్నిధిలో వైశాఖ బహుళ చవితి సంకట హర చతుర్థి సందర్భంగా మంగళవారం సామూహిక శ్రీ లక్ష్మీ గణపతి హోమం ఘణాంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు ,పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన లక్ష్మీ గణపతి హోమంలో అనేక మంది భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకొని హోమాన్ని తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## ప్రధాని పర్యటనలో భారీ భద్రత

**అధికారులతో సమీక్షలో సిఎస్ ఆదేశం**

**జయ జయ హే**

ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ మే 10వ తెలంగాణలో పర్యటించనున్న నేపథ్యంలో భద్రతా పరంగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావు ఆదేశించారు. అలాగే తగిన భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడా పొరపాట్లు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రధాని పర్యటన ఏర్పాట్లపై మంగళవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావు సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రధాన మంత్రి పర్యటనకు సంబంధించి జరుగుతున్న ఏర్పాట్ల వివరాలను ఆయన సమీక్షించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పర్యటనలో ప్రధానమంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. దీంతో పాటు అదేరోజు బహిరంగసభలో పాల్గొననున్నారు. అందుకు అనుగుణంగా బ్లూ బుక్ ప్రకారం తగిన భద్రతా ఏర్పాట్లు, శాంతిభద్రతలు, ట్రాఫిక్, బందోబస్త్ ఏర్పాట్లు చేయాలని పోలీసుశాఖకు ప్రధాన కార్యదర్శి సూచించారు. బేగంపేట్ విమానాశ్రయం, హెలిప్యాడ్‌లతో పాటు అన్ని వేదికల వద్ద తగినన్ని అగ్నిమాపక వాహనాలు ఏర్పాటు చేయాలని ఫైర్ సర్వీసెస్ శాఖ అధికారులను, అవసరమైన వైద్య సదుపాయాలు కూడా ఏర్పాటు చేయాలని, ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు.

## హంస రికార్డులు చూపించండి...!

**- ఫైనల్‌గా 8న రావాల్సిందే**

**- ఏప్రిల్ 16న రమ్మంటే గైర్హాజరయ్యారు**

**- వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ రాధారాణి**

**విశాఖపట్నం, మే 5, జయ జయహే :**

వైద్య ఆరోగ్య శాఖలోని హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్(హంస) కు సంబంధించిన రికార్డులు మొత్తం తీసుకురావాలని ఆ శాఖ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ రాధారాణి ఆదేశాలు జారీ చేశారు. ఈ అసోసియేషన్‌కు సంబంధించిన పలు అంశాలపై అనుమానాలున్నందున రికార్డులను తనిఖీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో ఈ నెల 8న రికార్డులతో హాజరు కావాలని పేర్కొన్నారు. గత నెల 16వ తేదీన విచారణకు రమ్మంటే గైర్హాజరయ్యారని ఇదే ఫైనల్ విచారణగా పేర్కొన్నారు. ఆ రోజు కాని రాకపోతే ఫిర్యాదుల్లో పేర్కొన్న అంశాలే సరైనవిగా భావించి తదుపరి నివేదికను ప్రభుత్వానికి అందజేస్తానని వెల్లడించారు. రోసా నిబంధనలకు అనుగుణంగా అసోసియేషన్ ఎన్నికలు జరుగుతున్నాయా...ఎన్నికల ప్రకటన...ఓటర్ జాబితా...నామినేషన్ దరఖాస్తులు...మినిట్స్ అండ్ ఫలితాలు...ఎన్నికల అధికారిని నియమించిన వారి అధికార హోదా...ఎన్నికల అధికారుల ఫోర్జరీ నివేదికలతో సరిపోల్చడం, మరిన్ని అంశాలకు సంబంధించి లోతుగా పరిశీలించేందుకు అవసరమైన నివేదికలన్నీ తనిఖీ చేస్తామని ప్రకటించారు.

## డిఈకి వీడ్కోలు పలికిన బలిరెడ్డి

**అగనంపూడి (జయ జయహే)**



విద్యుత్తు సెక్షన్ కార్యాలయం హెడ్ ఆఫీస్ కసింకోట డివిజన్ సర్కిల్ ఏపీ ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ రామకృష్ణ ని నర్సీపట్నం డివిజన్ ఈ ఈ గా బదిలీ అయిన సందర్భంగా జిల్లా టిఎన్టియుసి అధికార ప్రతినిధి బలిరెడ్డి సత్యనారాయణ వీడ్కోలు అభినందనలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్ రామకృష్ణ విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు, పీఎం సూర్య ఘర్ సోలార్ ఏర్పాటు విషయంలో వినియోగదారులకు అవగాహన కల్పించి మన్నలు పొందారు అని అన్నారు. ఎస్ రామకృష్ణ మాట్లాడుతూ ఎక్కడ వీధి నిర్వహణలు నిర్వహించిన విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే నా ధ్యేయం అని అన్నారు. పీఎం సోలార్ విద్యుత్ వినోదాల్లో వేపించుకోవడంలో మంచి స్పందన ఉందని అనకాపల్లి జిల్లాలో నర్సీపట్నం ప్రథమ స్థానంలో ఉందని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యుత్తు వినియోగాల సంక్షేమ విషయంలో ఎన్నో సంస్కరణలు తీసుకురావడం జరిగిందని. వినియోగదారులకు విద్యుత్ ఛార్జీలో పడకుండా ప్రభుత్వమే బరాయిస్తుందని అన్నారు. కసింకోట డివిజన్లో ఇది నిర్వహణకు సహకరించిన అధికారులకు సిబ్బందికి ధన్యవాదాలు తెలియజేశారు.

## రాత్రిపూట పాలలో యాలకులు, పసుపు
# కలుపుకుని తాగితే ఇన్ని లాభాలా?





**పాలలో కాల్షియం అధికంగా ఉంటుంది. ఇది ఎముకలను దృఢంగా తయారు చేయడంలో ఎంతో సహాయం పడుతుంది. అలాగే ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. దీని వల్ల జీర్ణ వ్యవస్థ మెరుగు పనిచేస్తుంది. చిటికెడు యాలకుల పొడి, పసుపు కలపడం వల్ల ప్రయోజనాలు కలుగుతాయి. అందుకే వీటిని గోల్డెన్ మిల్క్‌గా అభివర్ణిస్తున్నారు.**

ఈ గోల్డెన్ మిల్క్‌తో ఒత్తిడిని తగ్గించుకోవచ్చు. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు తీవ్రమైన ఒత్తిడిని తగ్గిస్తాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. దీంతో పాటు పసుపు కలుపుకోవడం వల్ల ఇందులో ఉండే యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు శరీరానికి విశ్రాంతి అందజేస్తాయి. అంతేకాకుండా జలుబు దగ్గు వంటి సాధారణ సమస్యలను నుంచి ఉపశమనం కలుగుతుంది.
కఫంతో బాధపడేవారు ఈ యాలకుల పాలను తాగడం వల్ల సమస్య నుంచి విముక్తి పొందవచ్చు. అలాగే కీళ్ళనొప్పులు, కండరాల సమస్యలతో బాధపడే వారు కూడా ఈ పాలు తీసుకోవడం వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. గ్యాస్, ఉబ్బరం, అజీర్ణం వంటి సమస్యలతో బాధపడే వారికి పసుపు, యాలకులతో చేసిన పాలు తాగడం వల్ల ఈ సమస్యల నుంచి ఉపశమనం కలుగుతుంది.
ఏలకులు, పసుపు రెండూ నిద్రను మెరుగుపరచడంలో సహాయపడతాయి. ఏలకులు ఒత్తిడిని తగ్గించే యాంటీఆక్సిడెంట్లను కలిగి ఉంటాయి. అయితే పసుపులో యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉన్నాయి. ఇవి శరీరానికి విశ్రాంతినిస్తాయి. పాలలో యాలకులు తీసుకోవడం వల్ల జలుబు, దగ్గు వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది.
ఛాతీలో పేరుకుపోయిన కఫాన్ని తొలగించడంలో కూడా ఏలకులు ఉపయోగపడతాయి. పసుపులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు ఉన్నాయి. ఇవి కీళ్ల, కండరాల నొప్పిని తగ్గించడంలో సహాయపడతాయి. ఏలకులు జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. అజీర్ణాన్ని నివారిస్తుంది.



# పుట్టగొడుగుల మసాలా కర్రీ

## ఇలా చేశారంటే సూపర్

పుట్ట గొడుగులు అంటే చాలా మందికి ఇష్టం. ఎంతో ఇష్ట పడి తింటారు. నాన్ వెజ్ తినని వారికి ఇది బెస్ట్ ఆప్షన్ అని చెప్పొచ్చు. ఇవి ఆరోగ్యానికి కూడా చాలా మంచిది. పుట్టగొడుగులకు మంచి మసాలా పెట్టి వండితే ఆహా అంటారు. చికెన్ కర్రీ లానే అనిపిస్తుంది. మష్రూమ్స్ కూడా ఆరోగ్యానికి చాలా మంచిది. ఇందులో ఉండే ప్రయోజనాలు అన్నీ ఇన్నీ కావు. ఈ విషయం చాలా మందికి తెలిసిందే. మరి మష్రూమ్ మసాలా కర్రీని ఎలా వండుతారు? ఈ కర్రీ చేయడానికి కావాల్సిన పదార్థాలు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం.

**మష్రూమ్ మసాలా కర్రీకి కావాల్సిన పదార్థాలు:**
మష్రూమ్, ఉల్లిపాయలు, పచ్చి మిర్చి, అల్లం వెల్లుల్లి పేస్ట్, కారం, పసుపు, ఉప్పు, పెరుగు, ధనియాల పొడి, జీలకర్ర పొడి, గరం మసాలా, చికెన్ మసాలా, కొత్తిమీర, పులావ్ దినుసులు, ఆయిల్, బటర్ లేదా నెయ్యి.

**మష్రూమ్ మసాలా కర్రీ తయారీ విధానం:**
ముందుగా పుట్టగొడుగులను శుభ్రంగా గోరు వెచ్చని నీటితో కడగాలి. అనంతరం మీకు నచ్చిన సైజులో కట్ చేసుకోవాలి. ఇప్పుడు ఈ గిన్నెలోనే అల్లం వెల్లుల్లి పేస్ట్, పెరుగు, కారం, పసుపు, ఉప్పు, పెరుగు, ధనియాల పొడి, జీలకర్ర పొడి, గరం మసాలా, చికెన్ మసాలా వేసి మ్యారినేట్ చేసుకోవాలి. ఇప్పుడు ఒక కర్రీ చేసే గిన్నె పెట్టి అందులో కొద్దిగా ఆయిల్, కొద్దిగా నెయ్యి లేదా బటర్ వేసి వేడి చేసుకోవాలి. ఇందులో పులావ్ దినుసులు వేసి ఫ్రై చేసుకోవాలి. ఇవి వేగాక ఉల్లిపాయ ముక్కలు, పచ్చి మిర్చి ముక్కలు వేసి కలర్ మారేంత వరకూ వేయించాలి.
ఇవి వేగాక కరివేపాకు వేసి వేయించి.. మ్యారినేట్ చేసి పక్కన పెట్టుకున్న పుట్టగొడుగులను వేసి బాగా కలపాలి. ఇవన్నీ ఓ పావు గంట సేపు వేయించుకోవాలి. అనంతరం రుచి చూసి.. కారం, ఉప్పు వేసి మళ్లీ ఒకసారి కలపాలి. అనంతర వాటర్ వేసి ఉడికించాలి. కర్రీ దగ్గర పడుతున్న కొత్తిమీర తరుగు, కొద్దిగా కరివేపాకు వేసి బాగా కలిపి.. దగ్గర పడ్డాక దించేయాలి. అంతే ఎంతో రుచిగా ఉండే మష్రూమ్ మసాలా కర్రీ సిద్ధం. ఈ కర్రీని అన్నం, రోటీలు, పులావ్‌లోకి వేసుకుని తింటే చాలా రుచిగా ఉంటుంది.

# ఒక్క పండు.. వందల లాభాలు

## డైలీ పరగడుపున తీసుకుంటే మైండ్ బ్లోయింగ్ అంతే..



**దానిమ్మ పండులో ఎన్నో పోషకాలు దాగున్నాయి.. అందుకే.. దానిమ్మ పండును తినాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. దానిమ్మలో కేలరీలు, కొవ్వు తక్కువగా ఉంటాయి.**

ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు అధికంగా ఉంటాయి. పొటాషియం, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి.. దానిమ్మపండులోని పాలీఫెనాల్స్ మీ గుండెను, రక్త నాళాలను ఆరోగ్యంగా ఉంచడంతోపాటు.. వ్యాధుల నుంచి రక్షిస్తాయి. అందుకే.. దానిమ్మపండును పోషకాల పండుగా పేర్కొంటారు. రోజూ ఒక దానిమ్మపండును తినడం వల్ల శరీరానికి అనేక ప్రయోజనాలు చేకూరుతాయి.. పోషకాలు పుష్కలంగా ఉండే దానిమ్మ పండ్లను తినడం వల్ల శరీరానికి అవసరమైన విటమిన్-సి, ఫోలేట్, పొటాషియం అందుతాయి. దానిమ్మలో చర్మాన్ని అందంగా మార్చే గుణాలు కూడా ఉన్నాయి. అయితే.. సాధారణంగా తినడంతో పోలిస్తే.. ఖాళీ కడుపుతో తింటే బోలెడన్ని ప్రయోజనాలు కలుగుతాయని నిపుణులు పేర్కొంటున్నారు. దానిమ్మ గింజలతోపాటు.. జ్యూస్ కూడా చేసుకుని తాగొచ్చు.. ప్రతి రోజు ఉదయం ఖాళీ కడుపుతో ఒక దానిమ్మ గింజలను తినడం లేదా జ్యూస్ తాగడం వల్ల కలిగే ప్రయోజనాలు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం..
దానిమ్మ తినడం వల్ల కలిగే ప్రయోజనాలు:

రోజూ ఒక దానిమ్మ పండును ఖాళీ కడుపుతో తింటే శరీరంలో బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్ వచ్చే ప్రమాదం తగ్గుతుంది. దానిమ్మను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ఒత్తిడి, వాపు తగ్గుతుంది. దానిమ్మ గుండె జబ్బులు, క్యాన్సర్, మధుమేహంలో సహాయపడుతుంది. దానిమ్మలో యాంటీఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉన్నాయి. ఇవి హృద్రోగులకు మేలు చేస్తాయి..
శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలను సమతుల్యం చేస్తుంది. రోజూ ఒక దానిమ్మపండు తింటే గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఇది గుండెపోటు ప్రమాదాన్ని కూడా తగ్గిస్తుంది. దానిమ్మ బీపీ సమస్యను కూడా నియంత్రిస్తుంది. దానిమ్మలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఫైబర్ ప్రేగు కదలిక ప్రక్రియలో సహాయపడుతుంది. దీన్ని తీసుకోవడం వల్ల పేగులు శుభ్రమవుతాయి. ఇది జీర్ణవ్యవస్థలో వాపును తగ్గిస్తుంది. ఖాళీ కడుపుతో తింటే అల్సర్ సమస్య దూరమవుతుంది. దానిమ్మలో యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి మరియు శరీరంలో మంట నుండి ఉపశమనం కలిగిస్తుంది. పెద్దప్రేగు క్యాన్సర్‌ను నివారించడంలో సహాయపడే మూలకాలు కూడా దానిమ్మలో ఉన్నాయి. దానిమ్మ విటమిన్ సికి మంచి మూలం. ఇది రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. డైలీ తినడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది.
దానిమ్మపండు తినడం వల్ల తెల్లరక్తకణాల పెరుగుదల మెరుగుపడుతుంది. దానిమ్మపండులో సన్ టానింగ్ నుండి రక్షించే సమ్మేళనాలు ఉన్నాయి. దానిమ్మపండు తినడం వల్ల మెదడు ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. దీనిలోని శోథ నిరోధక లక్షణాలు క్యాన్సర్ లక్షణాలను దూరం చేయడంలో సహాయపడతాయి.
నరాల సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించే గుణాలు దానిమ్మలో ఉన్నాయి.. రోజూ తినడం వల్ల మూత్రపిండాలు కూడా ఆరోగ్యంగా ఉంటాయి.. ఇది కిడ్నీ సంబంధిత సమస్యలను దూరం చేయడంలో సహాయపడుతుంది.



# సెలబ్రిటీల వాయిస్‌తో చాటింగ్



## వాట్సాప్ కొత్త ఫీచర్ అదిరిపోయింది

ప్రముఖ మెసేజింగ్ యాప్ వాట్సాప్ తన యూజర్లకు మెరుగైన సేవలు అందించడానికి నిరంతరం చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా అనేక ఫీచర్లను అప్ డేట్ చేస్తోంది.
ఈ యాప్ కు యూజర్ల కూడా బాగా ఎక్కువ. వాట్సాప్ యాప్ లేని స్మార్ట్ ఫోన్ ఉండదు. అంతలా ప్రజలందరికీ దగ్గరైంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం మరో ఫీచర్ ను అందుబాటులోకి తీసుకురానుంది. మెటా ఏఐ వాయిస్ ఫీచర్ తో ప్రముఖుల వాయిస్‌లను ఉపయోగించి చాట్ చేసుకోవడానికి వీలుంటుంది. నలుగురు ప్రముఖుల వాయిస్ లను దీనిలో అప్ డేట్ చేస్తారు. అయితే ఆ ప్రముఖులు ఎవ్వరనేది ఇంకా వెల్లడించలేదు.

**టూవే వాయిస్ చాట్ ఫీచర్..**
మెటా సంస్థ తన ఇన్ స్టంట్ మేనేజింగ్ యాప్ వాట్సాప్‌కు టూవే వాయిస్ చాట్ ఏఐ ఫీచర్ ను జోడించనుంది. దీని ద్వారా వినియోగదారులు వాయిస్ చాట్ లో కొత్త అనుభవం పొందుతారు. ప్రముఖుల వాయిస్ ను నియోగించుకునేందుకు అవకాశం లభిస్తుంది. వాట్సాప్ బీటా ఇన్ ఫో వెల్లడించిన వివరాల ప్రకారం.. మెటా సంస్థ ఏఐకి సంబంధించిన వివిధ వాయిస్ ఆప్షన్లపై పనిచేస్తోంది. ఈ కొత్త వాయిస్ ఫీచర్ లో ప్రముఖుల వాయిస్ లు ఉంటాయి. అలాగే వివిధ రకాల పిచ్, టోనాలిటీ, యాక్సెంట్ తో విభిన్న స్వరాలను అందించనుంది. వాట్సాప్ తన ఏఐ చాట్ బాట్ ను టూ వే వాయిస్ చాట్ ఫీచర్‌కు అనుసంధానం చేసి, అప్‌గ్రేడ్ చేయాలని చూస్తోంది. దీని ద్వారా ప్రముఖ వ్యక్తుల వాయిస్‌లతో యూజర్లు ఇంటరాక్ట్ అవ్వడానికి వీలు కలుగుతుంది.

**మెటా ఏఐ వాయిస్ మోడ్..**
ఈ వాయిస్ చాట్ ఫీచర్ త్వరలో వినియోగదారులకు అందుబాటులోకి రానుంది. ఈ ఫీచర్ ప్రస్తుతం ఆండ్రాయిడ్‌లో బీటా టెస్టర్‌లకు మాత్రమే అందుబాటులో ఉంది. అయితే త్వరలో వినియోగదారులందరూ ప్రసిద్ధ వ్యక్తులతో సహా పలు రకాల వాయిస్‌లకు యాక్సెస్ పొందే అవకాశం ఉంది. యూకే, యూఎస్ యాసలతో సహా అనేక స్వరాలను ఎంచుకోగలుగుతారు. గత ఏడాది మెటా మెసెంజర్ లో కస్టమ్ ఏఐ చాట్ బాట్ ను ప్రవేశపెట్టింది.

**మెరుగైన సేవలు..**
వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించే క్రమంలో వాట్సాప్ లో ఏఐ సామర్థ్యాలను పెంపుదల కనిపిస్తోంది. వాటి అమలులో పురోగతిని సూచిస్తోంది. మెటా ఏఐ చాట్ బాట్ తో యూజర్లకు మరింత సౌకర్యవంతమైన చాటింగ్ అనుభవం కలుగుతుంది. ప్రముఖుల వాయిస్ లతో చాట్ చేసుకోవడం వినియోగదారులకు సరికొత్తగా ఉంటుంది.



### జపనీయులు ఎక్కువకాలం జీవించడానికి

# కారణం తెలుసా?

భూమ్మీద అతి ఎక్కువ కాలం జీవించే మనుషులు ఎక్కడ ఉన్నారని ఎవరైనా అంటే... వెంటనే గుర్తుకువచ్చే పేరు జపాన్. ప్రత్యేకమైన జీవనవిధానం, సామాజిక, సాంస్కృతిక సంబంధాల కారణంగా జపనీయులకు సుదీర్ఘ జీవిత ప్రాప్తి కలిగింది. ఆ దేశస్తుల ఆరోగ్యకరమైన సుదీర్ఘ జీవితం వెనక కొన్ని అలవాట్లు ఉన్నాయి.

**నడక ప్రాధాన్యం**

చాలామంది జపాన్ దేశస్తులు పని ప్రదేశాలకు, విద్యాసంస్థలకు సాధ్యమైనంత వరకు నడిచి గానీ, సైకిల్ మీదగానీ వెళ్తారు. మరీ దూరం అనుకుంటే ప్రజా రవాణా ఉపయోగించుకుంటారు. ఇలా వారి జీవితంలో నడక, సైక్లింగ్ విడదీయరాని భాగాలు. ఇలా చేయడం వారి గుండె ఆరోగ్యానికి, కండరాల పటుత్వానికి, మంచి ఫిట్‌నెస్‌కు దోహదపడుతున్నది.

**హరా హచి బు**

జపాన్ ఆహార విధానంలో 'హరా హచి బు'ను విస్తృతంగా అనుసరిస్తారు. అంటే కడుపు నిండా కాకుండా%% 80 శాతం నిండే వరకే తినాలని అర్థం. ఇది ఎక్కువమొత్తంలో తినకుండా నియంత్రిస్తుంది. మెరుగైన అరుగుదలకు సహకరిస్తుంది. అలా జపనీయులు ఆరోగ్యకరమైన బరువును నిలుపుకొంటారు. రోగాల ముప్పును తగ్గించుకుంటారు.

**చాయ్ ప్రేమికులు**

తేనీరులో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలం. ఇక ఇన్‌ఫ్లమేషన్‌తో పోరాటానికి గ్రీన్ టీ సాయపడుతుంది. జీవక్రియల రేటును మెరుగుపరుస్తుంది. గుండెజబ్బులు, క్యాన్సర్ ముప్పును తగ్గిస్తుంది. రోజూ గ్రీన్ టీ తాగితే కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఎన్నో!

**శాంతి సామరస్యాలు**

జపాన్‌లో 'వ' అనే అంశానికి ప్రాధాన్యం ఉంది. ఇది సమాజంలో శాంతియుత సహజీవనాన్ని ప్రోత్సహిస్తుంది. అందరితో కలివిడిగా ఉండటం వల్ల ఒత్తిడి తగ్గుతుంది. మానసిక ఆరోగ్యం బాగుపడుతుంది. తోటివారితో సత్సంబంధాలు ఏర్పడతాయి.

**ఇకిగాయ్**

ఇది జపనీయుల రోజువారీ జీవితంలో తమకంటూ ఏదో ఒక ప్రయోజనం వెతుక్కునేలా చేస్తుంది. దాంతో వాళ్లు తమ పనిలో సంతృప్తి చెందుతారు. ఒత్తిడిని తగ్గించుకుంటారు. మానసిక ఆరోగ్యం మెరుగ్గా ఉంచుకుంటారు. జపనీయుల దీర్ఘకాల జీవితంలో ఇకిగాయ్ అండ ఎంతో!

**పరిశుభ్రతే ప్రధానం**

వ్యక్తిగతం మొదలుకుని పరిసరాల వరకు జపనీయులు పరిశుభ్రతకు చాలా ప్రాధాన్యం ఇస్తారు. రోజూ స్నానం చేయడం, తరచుగా చేతులు కడుక్కోవడం, శుభ్రమైన పరిసరాల్లో జీవించడం పట్ల వాళ్లెంతో శ్రద్ధ చూపుతారు. అలా మంచి ఆరోగ్యానికి హామీ ఇచ్చుకుంటారు.

**షిన్‌రిన్-యోకు**

అంటే అడవిలో స్నానం చేయడం అని అర్థం. పచ్చటి ప్రకృతిలోగడిపితే రక్తపోటు, ఒత్తిడి హార్మోన్ల ఊట తగ్గుతుంది. మూడ్ మెరుగుపడుతుంది.బంధాలకు జై జపనీయులు సామాజిక సంబంధాలకు ప్రాధాన్యం ఇస్తారు. తమకు దగ్గరివాళ్లు, తమలాంటి ఆలోచనలు కలిగినవాళ్లతో బంధాన్ని కలిగి ఉంటారు. అలా ఒత్తిడిని తగ్గించుకుంటారు. ఏదైనా కష్టం వస్తే ఒకరికి ఒకరం అనే భావన మనిషికి ఎంతో బలాన్ని ఇస్తుంది కదా!

### మీకు మీరుగానే మేకప్

# ఈజీగా వేసుకోవచ్చు



**ప్రజెంట్ మేకప్ అనేది కామన్ అయిపోయింది. అయితే, మేకప్ వేసుకునే ముందు కొన్ని టిప్స్ ఫాలో అవ్వాలి. అవేంటో తెలుసుకోండి.**

ముందు రోజుల్లో సినీ ఫీల్డ్‌లో ఉన్నవారు, సెలబ్రిటీలు మాత్రమే మేకప్ వేసుకునేవారు. కానీ, ఇప్పుడలా కాదు. ప్రొఫెషన్ ఏదైనా, ఇంట్లో ఉన్నా, బయటికి వెళ్ళినా మేకప్ వేసుకోవడం కామన్ అయిపోయింది. మేకప్ వేసుకోవడం వల్ల ఓ కాన్ఫిడెన్స్ వస్తుంది. దీంతో చాలా మంది మేకప్ వేసుకుంటున్నారు. మీరు కూడా మేకప్ వేసుకోవాలనుకుంటే ముందుగా కొన్ని టిప్స్ ఫాలో అవ్వాలి. అవేంటో తెలుసుకోండి.

**ముందుగా ఫేస్‌క్లీనింగ్..**

మేకప్ వేసుకునే ముందు ప్రతి ఒక్కరూ చేయాల్సిన పని ముఖాన్ని నీట్‌గా క్లీన్ చేసుకోవాలి. ఇది ఫస్ట్ ఇంపార్టెంట్ టిప్. దీని వల్ల ముఖంపై ఉన్న జిడ్డు, దుమ్ము పోతుంది. మేకప్ కూడా ఎక్కువసేపు చక్కగా ఉంటుంది.

**మాయిశ్చరైజర్..**

మేకప్ వేసుకునే ముందు కచ్చితంగా మాయిశ్చర్ రాయాలి. ఇందులో ఫేస్ మిస్ట్, సీరమ్స్, లోషన్స్, క్రీమ్స్ ఉంటాయి. మీ వీలుని బట్టి, మీకు ఏదైతే సెట్ అవుతుందో దానిని ఎంచుకుని ఫస్ట్ మాయిశ్చరైజర్ అప్లై చేయాలి.

**ప్రైమర్..**

మాయిశ్చరైజర్ రాశాక కాసేపు గ్యాప్ ఇచ్చి ప్రైమర్ తీసుకోవాలి. ప్రైమర్ అనేది ఇంపార్టెంట్ స్టెప్ అని చెప్పొచ్చు. ఇది మీకు మేకప్‌ని ఎక్కువసేపు ఉండేలా చేస్తుంది. అదే విధంగా, మేకప్ కూడా స్మూత్‌గా ఉండేలా చేస్తుంది. దీనిని ఫింగర్ టిప్స్ లేదా బ్రష్, స్పాంజ్‌తో అప్లై చేయొచ్చు. ఇది కళ్ళ కింద, ఇతర భాగాల్లో కొద్దిగా మాత్రమే పెట్టి అప్లై చేయాలి. కళ్ళకింద సరిగ్గా అప్లై చేయాలి. లేదంటే మేకప్ ప్యాచెస్‌లా కనిపిస్తుంది.

**లిక్విడ్ ఫౌండేషన్..**

లిక్విడ్ ఫౌండేన్ తీసుకుని రాయాలి. ఇది మీ స్కిన్ టోన్‌కి సరిపోయేది ఎంచుకోవాలి. దీనిని మీరు ఫింగర్ టిప్స్‌తో అయినా ఎంచుకోవచ్చు. లేదా బ్రష్, స్పాంజ్ అయినా వాడొచ్చు. అయితే, చేతులని చక్కగా క్లీన్ చేశాకనే వాడాలి. ఫింగర్ టిప్స్‌తో అప్లై చేశాక.. దీనిని మొత్తం కవర్ చేయడానికి బ్రష్ లేదా బ్లెండర్‌ని వాడండి.

**కన్సీలర్..**

ఇందులో రెండు రకాలు ఉంటాయి. లిక్విడ్, స్టిక్ అదే విధంగా కాంపాక్ట్. ఈ కన్సీలర్‌ని మీకు ముడతలు, కళ్ళకింద సర్కిల్స్, నోటి చుట్టూ కూడా ఎలాంటి మచ్చలు కనిపించకుండా కవర్ చేయొచ్చు.

**బ్రాంజర్, బ్లష్, హైలైటెర్..**

వీటిని వేయడం వల్ల మేకప్ మరింత అందంగా కనిపిస్తాయి. మీ చీక్స్ మెరిసిపోతాయి. బ్లష్ మీ అందాన్ని రెట్టింపు చేస్తుంది. తర్వాత హైలైటర్. దీని వల్ల మీ ముక్కు, చీక్ బోన్స్, ఐస్ కూడా చక్కని రీతిలో కనిపిస్తాయి.

**ఫౌండేషన్ పౌడర్..**

ఈ పౌడర్‌ని వాడకపోతే మీ మేకప్ లుక్ కేకీ లుక్‌లా కనిపిస్తుంది. అందుకే ఈ పౌడర్ని కచ్చితంగా వాడాలి. మంచి ఫ్లఫీ పౌడర్ బ్రష్ తీసుకుని ముందుగా లైట్‌గా కోట్ వేసి పౌడర్ వాడాలి. తర్వాత పౌడర్‌ని స్పాంజ్‌తో తీసుకుని చక్కగా అలా ట్యాప్ చేయండి.

**ఐ మేకప్..**

ఇప్పుడు ఐ మేకప్‌లో ముందుగా ఐబ్రోస్ సెట్ చేసుకోవాలి. తర్వాత ఐషాడో వేసుకోవాలి. తర్వాత ఐలైనర్, మస్కారా వేసుకోవాలి.


**లిప్..**

లిప్ గ్లాస్ ముందుగా పెట్టేసుకుని తర్వాత ఇష్టమైన లిప్‌స్టిక్ వేసుకోవచ్చు. దీంతో మేకప్ లుక్ ఫినిష్ అవుతుంది.

**సెట్టింగ్ స్ప్రే..**

సెట్టింగ్ స్ప్రే అనేది ఫైనల్ టచ్. దీని వల్ల మేకప్ రోజంతా అలానే ఉంటుంది. వెంటనే ఆయిలీగా కనిపించకుండా షైనీగా ఉంటుంది.

# గూగుల్ క్రోమ్ యూజర్లకు ప్రభుత్వం హెచ్చరిక..



ఇటీవల కాలంలో మనకు తెలియని విషయాన్ని గూగుల్ క్రోమ్‌లో సెర్చ్ చేయడం అనేది సర్వసాధారణమైపోయింది. చాలా మంది యూజర్లు గూగుల్ క్రోమ్ బ్రౌజర్ ప్రిఫర్డ్ బ్రౌజర్‌లో పెట్టుకుంటున్నారంటే గూగుల్ క్రోమ్ ఆదరణ గురించి మనం అర్థం చేసుకోవచ్చు. అయితే కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లో గూగుల్ క్రోమ్ వాడే వారిని ఇటీవల భారత ప్రభుత్వం హెచ్చరించింది. ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (సీఈఆర్‌టీ-ఐఎన్) డెస్క్‌టాప్ సిస్టమ్‌లలో గూగుల్ వినియోగదారులకు హై-రిస్క్ హెచ్చరికను జారీ చేసింది. గూగుల్ వెబ్ బ్రౌజర్‌లో ఇటీవల అనేక బగ్స్‌ను గుర్తించినట్లు ప్రభుత్వ సైబర్ సెక్యూరిటీ సంస్థ పేర్కొంది. గూగుల్ క్రోమ్‌ను వాడితే రిమోట్ ఆధారంగా ప్రభావిత సిస్టమ్‌లపై ఏకపక్ష కోడ్‌ని అమలు చేయడానికి అనుమతించే అవకాశం ఉ ందని వివరిస్తున్నారు. కాబట్టి వినియోగదారులు తమ సిస్టమ్‌లను రక్షించుకోవడానికి తమ క్రోమ్ బ్రౌజర్‌లను వెంటనే అప్‌డేట్ చేయాలని కోరుతుంది. ఈ నేపథ్యంలో గూగుల్ క్రోమ్ విషయంలో సీఈఆర్‌టీ-ఐఎన్ హెచ్చరికల గురించి వివరాలను తెలుసుకుందాం. సీఐవీఎన్ 2024-0231లో డెస్క్‌టాప్ కోసం గూగుల్ క్రోమ్‌లో వినియోగదారుల భద్రతకు తీవ్రమైన ముప్పు కలిగించే అనేక బగ్‌లను సీఈఐటీ గుర్తించింది. రిమోట్ అటాకర్‌లు టార్గెటెడ్ సిస్టమ్‌లపై ఏకపక్ష కోడ్‌ని అమలు చేసే అవకాశం ఉందని గుర్తించింది. ముఖ్యంగా ప్రత్యేక కోడ్‌ను రన్ చేయడం ద్వారా మన కంప్యూటర్ రిమోట్ కంట్రోల్‌ని తీసుకుని, సున్నితమైన డేటాను యాక్సెస్ చేసే అవకాశం ఉందని హెచ్చరించింది. మన సిస్టమ్‌ను రిమోట్ ద్వారా యాక్సెస్ చేసుకున్నాక హానికరమైన సాఫ్ట్‌వేర్‌ను ఇన్‌స్టాల్ చేయవచ్చు లేదా సిస్టమ్‌ను పూర్తిగా ఆపి వేసే అవకాశం ఉందని పేర్కొంది. ముఖ్యంగా హ్యాకర్లు మన కంప్యూటర్‌ను యాక్సెస్ చేయడం మొదలు పెట్టాక కంప్యూటర్ పనితీరులో ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందని అలాగే గ్రాఫిక్‌లను రెండరింగ్ చేయడానికి క్రోమ్ ఉపయోగించే వెబ్ జీపీయూ డాన్‌లో తగినంత డేటా ప్రామాణీకరణ లేకపోవడంతో క్రోమ్‌ను హ్యాక్ చేసే అవకాశం ఉందని సీఈఐటీ గుర్తించింది. డాన్ ద్వారా అనధికార కోడ్‌ని మన సిస్టమ్‌లో రన్ చేసే అవకాశం ఉందని సీఈఐటీ హెచ్చరించింది. హ్యాకర్ల బారిన మన సిస్టమ్ పడకుండా ఉండాలంటే గూగుల్ క్రోమ్‌ను అప్‌డేట్ చేయాలని సీఈఐటీ సూచిస్తుంది. మీ క్రోమ్ బ్రౌజర్ తాజా వెర్షన్‌కి అప్‌డేట్ చేయాలని కోరుతుంది. క్రోమ్‌ను అప్ డేట్ చేయడానికి బ్రౌజర్ మెనుకి వెళ్లి హెల్ప్ ఆప్షన్‌ను ఎంచుకోవాలి. అనంతరం అక్కడ గూగుల్ క్రోమ్‌ను ఎంచుకుంటే బ్రౌజర్ ఆటో అప్‌డేట్ కోసం తనిఖీ చేసి, వాటిని ఇన్‌స్టాల్ చేస్తుంది. ఈ నేపథ్యంలో భవిష్యత్ ప్రమాదాల నుంచి రక్షణగా ఉండడానికి గూగుల్ క్రోమ్‌లో ఆటోమేటిక్ అప్‌డేట్‌లను ప్రారంభించాలి సీఈఐటీ సూచిస్తుంది.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com